
శనివారం 18 జనవరి 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



5

చిరస్మరణీయుడు
## తారకరాముడు
(స్వర్గీయ ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

# ఉక్కుతో చెక్కిన చారిత్రక ఘట్టమిది!

- కేంద్ర ప్యాకేజీపై సీఎం చంద్రబాబు ప్రతిస్పందన
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ
- ప్రధాని మోదీ వరానికి చంద్రబాబు ధన్యవాదాలు
- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు
- యాజమాన్యం, కార్మికులే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి
- ఏడు నెలల్లోనే రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు
- రూ.2 లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శ్రీకారం
- కూటమి సమర్థతకు ఫలితాలే నిదర్శనం: సీఎం చంద్రబాబు

2 లో





విశాఖ ఉక్కుకు
## పునరుజ్జీవం

- రూ.11,400 కోట్ల ఆర్థిక ప్యాకేజీ
- తక్షణం అమల్లోకి
- ప్రకటించిన కేంద్రం
- కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడి

2 లో

నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై
# నిర్ణయానికి సబ్‌కమిటీ

- వచ్చే కేబినెట్ భేటీలోగా ప్రభుత్వానికి నివేదిక
- ధాన్యం కొనుగోలుకు రూ.700 కోట్ల అదనపు రుణం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టీజీఎస్ ఏర్పాటు
- తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలు
- అభ్యంతరంలేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ
- 62 నియోజకవర్గాల్లో అదనంగా 63 అన్న క్యాంటీన్లు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం
- వివరాలు వెల్లడించిన సమాచార మంత్రి కొలుసు

3 లో

## సాగునీటి రంగాన్ని విధ్వంసం చేసింది జగనే



6

- గోదావరి, కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత ఉందా?
- బెయిల్ కోసం రాష్ట్ర హక్కులను కాలరాశారు
- నేడు అవినీతి పత్రికలో అసత్య కథనాలతో ప్రచారం
- మంత్రి నిమ్మల ధ్వజం

# పనితీరు మెరుగుపర్చండి



- మంత్రులు, ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- స్వచ్ఛ ఆంధ్రాలో ఫలితాలు సాధించాలి...
- సోషల్ మీడియా బలమైన ఆయుధం
- పార్టీ బలోపేతానికి సమర్థంగా వాడుకోవాలి
- టాప్ ర్యాంకుల్లో కృష్ణా, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలు
- కడపటి ర్యాంకుల్లో కడప, అల్లూరి, తూర్పు జిల్లాలు

4 లో

యువతకు ఉద్యోగాలు, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా..
## మంత్రి లోకేష్ దావోస్ టూర్!

- 20 నుంచి 24వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరు
- 5 రోజుల పర్యటనలో 50 మందికిపైగా ప్రముఖులతో సమావేశాలు
- 30 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీ
- మంత్రి లోకేష్ వైపు పారిశ్రామిక వర్గాల చూపు

7 లో

ఉక్కు సంకల్పానికి
## ఊపిరి

విశాఖ స్టీల్‌కు కేంద్ర ప్యాకేజీపై టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా హర్షం



5

ఉక్కు రెక్కల ఆయుధాలతో
## కొత్త శిఖరాలకు

- విశాఖ ఉక్కుపై హామీ నిలబెట్టుకున్నాం
- ప్రత్యేక ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్‌కు మంచిరోజులు
- ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, కుమారస్వామి, నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు
- సీఎం చంద్రబాబు ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం
- మంత్రి నారా లోకేష్

7 లో

# రాష్ట్రం.. ఈవీ తయారీ గమ్యస్థానం

- ఓర్వకల్లులో దేశంలోనే మొదటి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వెహికల్ పార్క్
- మారనున్న దేశ ఈవీ తయారీ రంగం దశ, దిశ
- ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ పేరుతో ఏర్పాటు
- పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ
- మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు
- వచ్చే మార్చి చివరిలో శంకుస్థాపన

6 లో



# విశాఖ ఉక్కుకు పునరుజ్జీవం

- రూ.11,400 కోట్ల ఆర్థిక ప్యాకేజీ
- తక్షణం అమల్లోకి
- ప్రకటించిన కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

ఢిల్లీ (చైతన్యరథం): విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం కొత్త ఊపిరు లూదింది. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న కర్మాగారాన్ని పునరుజ్జీవింపజేయ డానికి ముందుకొచ్చింది. ఇందుకోసం రూ.11,440 కోట్ల ప్యాకేజీని ప్రకటిం చింది. ఈ మేరకు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ ప్యాకేజీకి గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమి టీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

## అర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి

ఇది భారీ పునరుద్ధరణ ప్యారేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు పోర్టు అధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమ ల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటు లోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్ఎండీసీతో చర్చిస్తున్నాం ఆత్మ నిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలకపాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చ డంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు.. అని అశ్వినీవైష్ణవ్ తెలిపారు.

## నష్టాల నుంచి గట్టెక్కించేందుకు

ఏటా 1.3 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యమున్న విశాఖ ఉక్కు కర్మాగారం 2023-24లో రూ.4,848.86 కోట్లు, 2022-23లో రూ.2,858.74 కోట్ల నష్టాన్ని మూట గట్టుకొంది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పులు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎన్డీయే మాటమి అధికారంలోకి రావడంతో స్టీల్ ప్లాంట్ పై ప్రత్యేక దృష్టి సారించింది. ఏపీ సీఎం



చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవ డంతో కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామి ప్లాంటును సందర్శించారు. ప్లాంటు నిలదొక్కుకోవడానికి రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, కార్మిక సంఘాల నేతలు ఆయనకు విన్న వించారు. ఆ తర్వాత కొన్ని రోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద.. జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్ల చొప్పున రెండు విడతల్లో కేంద్ర ఉక్కుశాఖ సాయం చేసింది. వర్కింగ్ క్యాపిటల్ కోసం చేసిన అప్పుల భారం, తగినంత ముడిసరకు లేకపోవడం, కోర్టు ఎటాచ్‌మెంట్లు, ఇన్‌సాల్వెన్సీ ప్రొసీడింగ్‌లతో విశాఖ ఉక్కు కర్మాగారం తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకుంది. వీటిని తీర్చడంతోపాటు భవిష్యత్తులో తలెత్తే కష్టాల నుంచి తప్పించడానికి ఒక సమగ్ర ప్రణాళికను తయారు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇదివరకే పార్లమెంటు స్థాయీసంఘానికి చెప్పింది. దానిపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని పార్లమెంటుకు సమర్పించిన నివేదికలో స్థాయీ సంఘం సిఫార్సు చేసింది. దాని ప్రకారమే కేంద్ర ప్రభుత్వం ఈ ప్యాకేజీకి ఆమోదముద్ర వేసింది. ఈ ప్రకటనతో స్టీల్ ఫ్యాక్టరీకి సంబంధించి ప్రైవేటీకరణ అంశం వెనక్కి వెళ్లిందని చెప్పుకోవచ్చు. దీనిపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# ఉక్కుతో చెక్కిన చారిత్రక ఘట్టమిది!

- కేంద్ర ప్యాకేజీపై సీఎం చంద్రబాబు ప్రతిస్పందన
- విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్ల ప్యాకేజీ
- ప్రధాని మోదీ వరానికి చంద్రబాబు ధన్యవాదాలు
- కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు
- ఆంధ్రుల అభీష్టం, కార్మికుల శ్రమ ఫలించింది
- యాజమాన్యం, కార్మికులే నిర్వహణ బాధ్యత తీసుకోవాలి
- డబుల్ ఇంజిన్ సర్కార్‌తో డబుల్ డిజిట్ గ్రోత్ సాధ్యం
- ఏడు నెలల్లోనే రాష్ట్రానికి రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులు
- రూ.2 లక్షల కోట్ల అభివృద్ధికి ప్రధాని మోదీ శ్రీకారం
- కూటమి సమర్థతకు ఫలితాలే నిదర్శనం: సీఎం చంద్రబాబు




అమరావతి (చైతన్య రథం): విశాఖ స్టీల్ ప్లాంటుకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ.. 'ఈరోజు ఉక్కుతో చెక్కబడిన ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని సూచిస్తుంది. ఇది ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భావోద్వేగ మరియు గర్వించదగిన క్షణం. విశాఖ స్టీల్ ప్లాంటుకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడం గొప్ప విషయం. ఈమేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, కుమారస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. విశాఖ ఉక్కుకు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులే. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు' అని పేర్కొన్నారు.

## విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం విశాఖ నగరవాసులే కాకుండా ఎంతోమంది ఉద్యమాలు, ఆందోళనలు చేశారు. ఎందరో ప్రాణత్యాగాలు చేశారు. తెలుగుజాతి సాధించుకున్న ఉక్కు ఫ్యాక్టరీని కాపాడుకోవడానికి ఏడు నెలలుగా అన్ని ప్రయత్నాలు చేశాము. 1996లో స్టీల్‌ప్లాంట్‌కు ఇబ్బందులొస్తే నాటి ప్రధాని వాజ్‌పేయితో మాట్లాడి రూ.1650 కోట్లు సాధించాము. స్టీల్‌ప్లాంట్‌కు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా ఆదుకుంది ఎన్డీఏ ప్రభుత్వమే. అదే సమయంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్నదీ తెలుగుదేశమే.

## గత పాలకులు స్టీల్ ప్లాంట్‌ను నిర్లక్ష్యం చేశారు

గడిచిన ఐదేళ్లలో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్లక్ష్యం చేయడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. స్టీల్‌ప్లాంట్‌ను కాపాడతామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం. ఇందుకోసం విశాఖ ఎంపీ భరత్ తనవంతు కృషి చేశారు. ఢిల్లీలో అనేక సమావేశాలు నిర్వహించాము. ఒకసారి ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ రాత్రి పన్నెండున్నరకు సమీక్ష చేశారు. పట్టుదలతో పనిచేశాం. చిత్తశు ద్ధితో ముందుకెళ్లాం. ప్రధాని మోదీ సానుకూలంగా స్పందించారు అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

## అసాధ్యాన్ని సుసాధ్యం చేశాం

'విశాఖ ప్రజల అభీష్టం, కార్మికుల శ్రమ ఫలించింది. నేను విశాఖలో పనిచేసే కార్మికులకు ఒకటే విన్నవిస్తున్నాను. ప్రజలు మనపై పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సమర్థవంతంగా నిర్వహించడంలో మేనేజ్‌మెంట్, కార్మికులు బాధ్యత తీసుకోవాలి. ఈ ఫ్యాక్టరీకి సమర్థవంతులైన సీఈవోను నియమిస్తాము. కావాల్సిన వనరులను సమీకరిస్తాం. స్టీల్‌ప్లాంట్‌కు 20 వేల ఎకరాల భూములున్నాయి. దేశంలో ఎక్కడా ఏ స్టీల్‌ప్లాంట్‌కు ఇంత విలువైన భూమి లేదు. అందరం కలిసి కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయి. నేను కూడా శ్రద్ధ పెడతాను. ప్యాకేజీ ఇచ్చిన కేంద్రం మెచ్చుకొనేలా పనిచేద్దాము అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

## ఏడు నెలల్లో అద్భుత ఫలితాలు సాధించాం

ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చుకుంటూ వస్తున్నాం. అమరావతికి కేంద్రం రూ.15000 వేల కోట్లు ఈఏపీ ద్వారా ఇప్పించింది. నిలిచిపోయిన పోలవరానికి రూ.12,157 వేల కోట్లు సాధించాము. రైల్వే జోన్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారు. ఏడు నెలల్లో రూ.4 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. రూ.2.8 లక్షల కోట్ల పనులకు ప్రధాని శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. టీసీఎస్ రాకతో యువతకు ఉద్యోగాలు వస్తాయి. గూగుల్, ఏఐ, డేటా సెంటర్‌తో మంచి ఫలితాలు వస్తాయి. ఇక్కడి నుంచి సింగపూర్‌కు సీ కేబుల్ వేసి అనుసంధానిస్తాము. గ్రీన్ హైడ్రోజన్‌పై ఎన్టీపీసీ, జెన్‌కో జాయింట్ వెంచరుగా రూ.లక్షా 80 వేల కోట్లు ఖర్చు పెట్టబోతున్నాం. మిథల్ ప్రాజెక్టుకు 14 మిలియన్ మెట్రిక్ టన్నుల ఐరన్ ఓర్ ఇచ్చేందుకు కేంద్రం ఒప్పుకుంది. ఇది నక్కపల్లి దగ్గర తొందరలోనే ప్రారంభమవుతుంది. ఒక స్టీల్ సిటీ రానుంది. నక్కపల్లిలో స్టీల్ సిటీనేకాకుండా రూ.14,000 వేల కోట్లతో ఫార్మా సిటీ వస్తోంది దీనివల్ల 70 వేలమందికి ఉద్యోగాలు వస్తాయి. త్వరలోనే విశాఖ-అనకాపల్లి కలిసిపోతాయి. ఓర్వకల్లులో రూ.2,786 కోట్లతో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ, కొప్పర్తిలో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీకి రూ.2,137 కోట్లు మంజూరయ్యాయి. రూ.55 వేల కోట్ల వ్యయంతో జాతీయ రహదారులన్నీ రాబోయే రెండు మూడేళ్లలో పూర్తవుతాయి. అమరావతికి 8లైన్ల ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్రాన్ని అనుమతి కోరాను. రూ.400 కోట్లతో టూరిజం కారిడార్ రాబోతోంది. సూర్యలంక, శ్రీశైలం, రాజమహేంద్రవరం, సంగమేశ్వరాలయంవంటి ప్రాంతాల్లో టూరిజం అభివృద్ధి చేస్తాం' అని రాష్ట్ర భవిష్యత్ ప్రగతి చిత్రాన్ని చంద్రబాబు వివరించారు.

## గత ఐదేళ్లలో రాష్ట్రమంతటా చీకట్లే

ఈ ఏడాది రాష్ట్ర వృద్ధి రేటు 12.95 శాతానికి చేరింది. దీన్ని 15 శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్నాము. అభివృద్ధి సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తున్నాము. ఏడు నెలల క్రితం రాష్ట్రమంతటా చీకటే ఉంది. అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. కేంద్ర నిధులనూ దారిమళ్లించారు. మరో నాలుగైదు నెలల్లో అన్ని వ్యవస్థలనూ గాడిన పెడతాం. 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం. ఉన్న ఉద్యోగాలు కాపాడుకుంటూనే కొత్త ఉద్యోగాలు కల్పిస్తాము. మరోసారి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్యాకేజీ ఇచ్చిన ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.

చైతన్యరథం

## నిషేధిత జాబితానుంచి తొలగించిన భూములపై

# నిర్ణయానికి సబ్‌కమిటీ



- వచ్చే కేబినెట్ భేటీలోగా ప్రభుత్వానికి నివేదిక
- ధాన్యం కొనుగోలుకు రూ.700 కోట్ల అదనపు రుణం
- గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టీజీఎస్ ఏర్పాటు
- తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలు
- అభ్యంతరంలేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ
- 62 నియోజకవర్గాల్లో అదనంగా 63 అన్న క్యాంటీన్లు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో నిర్ణయం
- వివరాలు వెల్లడించిన సమాచార మంత్రి కొలుసు



అమరావతి (చైతన్య రథం): నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైకాపా హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏంచేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్చార్జి మంత్రులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఇ-క్యాబినెట్ సమావేశంలో పలు అంశాలపై తీసుకున్న నిర్ణయాలను సమాచార మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

### కేబినెట్ సమావేశంలో ఆమోదించిన అంశాలివే..

2024-25 ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు రూ.700 కోట్లు రుణం తీసుకోవడంపై కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇప్పటికే పొందిన రూ.6వేల కోట్ల రుణానికి ఇది అదనం. ఆ నిధులను సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు బదిలీకి మంత్రి మండలి ఆమోదించింది. దేశంలో ఎక్కడా లేనివిధంగా ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటలు, కొన్ని సందర్భాల్లో కేవలం ఆరేడు గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి సొమ్మును జమ చేస్తున్న అంశంపైనా కేబినెట్ చర్చించింది. ఈ సీజన్‌లో 28,083,238 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని, దాదాపు 4.6 లక్షల మంది రైతుల నుండి సేకరించి వారికి రూ.6,469 కోట్లను చెల్లించినట్టు మంత్రి కొలుసు వెల్లడించారు. ఇంకా కొంత ధాన్యాన్ని సేకరించాలనే లక్ష్యంతో రుణం తీసుకుంటున్నామని, ఏపీ మార్క్‌ఫెడ్డు ప్రభుత్వ హామీ ప్రతిపాదనకూ కేబినెట్ ఆమోదం లభించిందన్నారు. ప్రస్తుత సీజన్‌లో ధాన్య సేకరణ విషయంలో ఎదురైన మాయిచ్చర్ సమస్యను వచ్చే సీజన్‌లో అధిగమించేలా మాయిచ్చర్ ఫుల్ ప్రూఫ్ విధానాన్ని అనుసరించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారని చెప్పారు.

ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై కేబినెట్ ఓకే చెప్పింది. విద్యుత్ సుంకంలో టారిఫ్ తగ్గింపును మార్చి వరకు పొడిగిస్తూ ఆమోదించింది. దీనిమూలంగా దాదాపు రూ.300 కోట్లమేర అదనపు భారం ప్రభుత్వం మీద పడుతుంది. ఈ ఫెర్రో అల్లాయ్స్‌లో పనిచేస్తున్న దాదాపు 40 వేలమంది ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గతంలో పాల్వంచలోని నవబాగ్ ఫెర్రో అల్లాయ్స్‌కు కూడా ఇటువంటి సహకారాన్ని ప్రభుత్వం అందించడం జరిగింది.

62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి మంత్రిమండలి ఆమోదించింది. ఒక్కో అన్న క్యాంటీన్‌ను రూ.61 లక్షలతో మొత్తం అంచనా వ్యయం రూ.38.43 కోట్లతో ఏర్పాటు చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు ఓకే చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే 203 అన్నా కాంటీన్లు ఏర్పాటయ్యాయని, పూటకు కేవలం రూ.5లకే కడుపు నిండా శుచికరమైన భోజనం పెట్టే మహత్తర కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. క్యాంటీన్ల నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు ప్రత్యేకంగా సొసైటీని ఏర్పాటు చేయాలని, ఒక మేనేజ్మెంట్ కమిటీ, ఎడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసే ప్రతిపాదనలను రూపొందించాలని ముఖ్యమంత్రి సూచించినట్టు మంత్రి కొలుసు వెల్లడించారు.

తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు కేబినెట్ ఓకే చెప్పింది. నాగావళి నదిపై సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్ట్ ఎడమవైపు హెడ్ స్లూయిస్‌కు ఎడమవైపు 1.0 మెగావాట్ల మినీ హైడల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన మే ఎన్‌కాన్స్ లిమిటెడ్‌కు నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ జారీ చేసేందుకు చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదించింది. ఈ మినీ హైడల్ ప్లాంట్ ఏర్పాటు వల్ల పర్యావరణ అనుకూల గ్రీన్ పవర్ ఉత్పత్తికి అవకాశం కలుగుతుంది. ప్రాజెక్ట్ సమీప ప్రాంతాల్లో వోల్టేజ్ పరిస్థితులను మెరుగుపడటంతోపాటు స్థానికంగా ఉపాధి కల్పన, వ్యవస్థాపకత అభివృద్ధి మరియు నీటి రాయల్టీ ద్వారా ప్రభుత్వానికి అదనపు ఆదాయం చేకూరనుంది. భవిష్యత్తులో ఏర్పాటు చేసే చిన్నచిన్న పవర్ ప్లాంట్లలో ఎస్.హెచ్.జి. మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారా ఉపాధి కల్పిస్తూ మహిళా సాధికారత సాధనకు తగు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారని మంత్రి కొలుసు వివరించారు.

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం తాడేపల్లి గ్రామ పరిధిలో ప్రకాశం బ్యారేజీకి దిగువన కృష్ణానదికి కుడి మార్జిన్‌లో వరద రక్షణ గోడ నిర్మాణ పనులకు రూ.294.20 కోట్లతో పరిపాలన అనుమతి మంజూరీ ప్రతిపాదనలకు మంత్రి మండలి ఆమోదించింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో కృష్ణా వరద ఉధృతి కారణంగా తాడేపల్లి పరిధిలోని సుందరయ్యనగర్, మహానాడు కాలనీ తదితర ప్రాంతాలు ముంపునకు గురై బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ పరిస్థితిని నివారించేందుకు రక్షణ గోడ అవసరాన్ని కేబినెట్ చర్చించింది. కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు ఆమోదం, అభ్యంతరంలేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు ఆమోదం, పేదలకు ఇళ్ల స్థలాలపై ప్రతిపాదనలు సిద్ధం చేయడానికీ కేబినెట్ ఆమోదం తెలిపింది.

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం రాష్ట్రంలో 11,162 గ్రామ సచివాలయాలను మరియు 3,842 వార్డు సచివాలయాలను ఏర్పాటు చేయడం జరిగింది. 11 మందిని గ్రామ సచివాలయంలోను మరియు 10మందిని వార్డు సచివాలయాల్లోనూ ఉద్యోగులుగా నియమించడం జరిగింది. ఎటువంటి ఆలోచన, ముందు చూపు లేకుండా గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థలు ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించడం లేదనే అభిప్రాయం నెలకొని ఉంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్జీఎస్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది గ్రామ, వార్డు సెక్రటేరియట్లను మూడు కేటగిరీలుగా విభజించడం జరిగింది.

3,501 జనాభాకు పైబడివున్న సచివాలయాన్ని 'ఏ' కేటగిరీగా, 2,501 నుండి 3,500 వరకూ జనాభా ఉన్న సచివాలయాన్ని 'బి' కేటగిరీగా మరియు 2,500 జనాభాలోపు ఉన్న సచివాలయాన్ని 'సీ' కేటగిరీగా విభజించడం జరిగింది. 3,501 జనాభాకు పై బడి ఉన్న సచివాలయంలో ఎనిమిది మంది ఉద్యోగులను, 2,501 నుండి 3,500 వరకూ జనాభా ఉన్న సచివాలయంలో ఏడుగురిని మరియు 2,500 జనాభా లోపు ఉన్న సచివాలయంలో ఆరుగురు ఉద్యోగులను కేటాయించడం జరిగింది. మల్టీ పర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్, ఆస్పిరేషనల్ ఫంక్షనరీస్‌గా ఉద్యోగులను విభజించడం జరిగిందని మంత్రి కొలుసు వివరించారు.

విధాన పర్యవేక్షణకు రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి కమిటీలనూ ఏర్పాటు చేయనున్నారు. రెవిన్యూ మంత్రి చైర్మన్‌గా పురపాల మరియు గృహ నిర్మాణ మంత్రులు, కార్యదర్శులు సభ్యులుగా రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్టు కొలుసు వివరించారు. జిల్లా స్థాయిలో ఇన్‌చార్జి మంత్రి చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు సభ్యులుగా జిల్లాస్థాయి కమిటీ ఉంటుందని మంత్రి వివరించారు.

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) ప్రారంభంలోనే పలు పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. కేబినెట్ భేటీ అనంతరం పలు రాజకీయ అంశాలపై చంద్రబాబు చర్చించారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మత్స్యకార భరోసా పథకాల అమలుకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ నిర్మాణం, రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు వెంటనే ప్రారంభమవుతాయని సీఎం వెల్లడించారు.

రాష్ట్ర ఆదాయాన్ని, ఆర్థిక పరిస్థితిని ఏవిధంగా పెంచాలనే అంశంపైనా ఈ -కేబినెట్‌లో చర్చించినట్టు మంత్రి కొలుసు పార్థసారథి వివరించారు. స్వర్ణాంధ్ర -2047 లక్ష్యాల సాధనకు అనుగుణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చేందుకు పూర్తిస్థాయిలో అందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్టు వివరించారు. ముఖ్యమంత్రి దావోస్ పర్యటన విజయవంతం కావాలని మంత్రి మండలి సభ్యులు ఆకాంక్షిస్తూ ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారని మంత్రి కొలుసు వివరించారు.

చైతన్యరథం

# పనితీరు మెరుగుపర్చండి

- మంత్రులు, ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం
- స్వచ్ఛ ఆంధ్రాలో ఫలితాలు సాధించాలి...
- సోషల్ మీడియా బలమైన ఆయుధం
- పార్టీ బలోపేతానికి సమర్థంగా వాడుకోవాలి
- టాప్ ర్యాంకుల్లో కృష్ణా, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలు
- కడపటి ర్యాంకుల్లో కడప, అల్లూరి, తూర్పు జిల్లాలు



అమరావతి (చైతన్య రథం): ప్రస్తుతమున్న 53శాతం ఓటింగ్‌ను వచ్చే ఎన్నికలనాటికి 60శాతానికి చేర్చేలా ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు చిత్తశుద్ధితో పని చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిశా నిర్దేశం చేశారు. స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో తనకు కావాల్సింది ఫొటోలకు ఫోజులు కాదని, ఫలితాలని తేల్చి చెప్పారు. ఉండవల్లి నివాసంలో పార్టీ మంత్రులు, ఎంపీలు, జోనల్ కో-ఆర్డినేటర్లతో శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబు సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధుల పనితీరును విశ్లేషిస్తూనే.. సోషల్ మీడియాను సక్రమంగా వినియోగించుకోవడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. పార్టీ సమావేశానికి కొందరు ఎంపీల గైర్హాజరుపై లావు శ్రీకృష్ణదేవరాయల్ని సీఎం ప్రశ్నించారు. పార్టీ సమావేశాల కంటే ఇతర కార్యక్రమాలు ఎక్కువయ్యాయా? అని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి పార్లమెంట్ పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు, ఎంపీ, ఇన్చార్జి మంత్రి, జోనల్ ఇన్చార్జి సమన్వయంతో పనిచేయాలని చంద్రబాబు సూచించారు. క్షేత్రస్థాయి ఇబ్బందులు ఎప్పటికప్పుడు జోనల్ ఇన్చార్జీలు.. ఇన్చార్జి మంత్రులకు చెప్పి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని సూచించారు. ఎమ్మెల్యే తప్పు చేస్తే ఇన్చార్జి మంత్రిదే బాధ్యతగా సీఎం చంద్రబాబు తేల్చిచెప్పారు.

ఇన్చార్జి మంత్రి, ఎంపీ పనితీరు, జిల్లాలో పథకాల అమలు తదితర అంశాల ఆధారంగా సీఎం ర్యాంకులు ప్రకటించారు. తొలి మూడు స్థానాల్లో కృష్ణా, చిత్తూరు, ఎన్టీఆర్ జిల్లాలు, చివరి 3 స్థానాల్లో కడప, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాలు ఉన్నాయి. కేంద్ర నిధుల సాధనలో ఎంపీలు, రాష్ట్ర మంత్రుల మధ్య సమన్వయం మరింత పెరగాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఐటీ నిపుణుడివైనా సోషల్ మీడియా వినియోగంలో ఎందుకు వెనకబడ్డావని మంత్రి కొండపల్లిని సీఎం ప్రశ్నించారు. సోషల్ మీడియా వినియోగంలో మంత్రి ఫరూఖ్ చివరి స్థానంలో ఉన్నారని ఆక్షేపించారు.

ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం పెంచేందుకు ఎమ్మెల్యేలు, ఎంపీలు సోషల్ మీడియా వినియోగం పెంచాలని సీఎం దిశానిర్దేశం చేశారు. కలెక్టర్, ఎమ్మార్వో, ఆ కిందస్థాయి అధికారులు అర్జీలు, దస్త్రాలను పరిష్కరించకుండా తమ పరిధి నుంచి పంపేయటం సరికాదన్నారు. తమ వద్దకు వచ్చిన అర్జీ లేదా దస్త్రాన్ని ఎందుకు పరిష్కరించలేపోతున్నారో దానిపై అధికారులు కారణం రాసే విధానం తీసుకురావాలని సూచించారు. కారణం రాసే విధానం అమల్లోకి వస్తే జవాబుదారీతనం పెరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

## విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ హర్షణీయం

### ప్రధాని మోదీకి మంత్రి స్వామి కృతజ్ఞతలు



అమరావతి(చైతన్యరథం): విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440కోట్ల ఆర్థిక ప్యాకేజీ ప్రకటించిన ప్రధాని మోదీకి మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందనే దానికి ఈ ప్యాకేజీనే నిదర్శనమన్నారు. వైసీపీ హయాంలో స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసేందుకు జగన్ గ్యాంగ్ కుట్ర పన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు జోడితో స్టీల్ ప్లాంటుకు పూర్వవైభవం రానుంది. వైసీపీ అసమర్థ పాలనతో రాష్ట్రం అన్ని విధాలా నష్టపోయింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో కేంద్రం నుంచి రాష్ట్రానికి సాధించింది కూడా శూన్యం. నేడు కేంద్రం సహకారంతో రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అవిశ్రాంతంగా శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.

## ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు జీవం

- ప్రధానికి, ముఖ్యమంత్రికి ప్రజల తరపున కృతజ్ఞతలు
- విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదం ఎప్పటికీ సజీవమే
- వైసీపీ హయాంలో నిర్లక్ష్యం, ఎన్డీయే హయాంలో అభివృద్ధి
- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు



అమరావతి (చైతన్యరథం): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ కోసం భారీ ప్యాకేజీ ప్రకటించి విశాఖ ఉక్కుకు ఎన్డీయే ప్రభుత్వం జీవం పోసిందని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తంచేశారు. వైసీపీ హయాంలో విశాఖ ఉక్కును నిర్లక్ష్యం చేశారని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విశాఖ ఉక్కును ప్రైవేటీకరణను నిలుపుదల చేయడమే కాకుండా భారీ ప్యాకేజీ ప్రకటించడం హర్షణీయమని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

రెండేళ్లలో విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందని, స్టీల్ ప్లాంటును అప్పుల్లోనుంచి బయటకు తేవడమే ప్రథమకర్తవ్యంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రూ.11,400 కోట్ల ప్యాకేజీకి నిర్ణయంతో రాష్ట్ర ప్రజలు, ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రజల సంతోషం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదం ప్రజల గుండెల్లో ఎప్పటికీ సజీవమే అన్నారు. భారీ ప్యాకేజీ ప్రకటించినందుకు రాష్ట్ర ప్రజలు, ఉత్త రాంధ్ర ప్రజల తరపున ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి అచ్చెన్నాయుడు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## సీఐడీ మాజీ చీఫ్ సునీల్‌కుమార్‌పై విచారణకు ఉత్తర్వులు

అమరావతి (చైతన్యరథం): సీఐడీ మాజీ చీఫ్, సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌పై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి ఎంపీ, ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును కస్టోడియల్ టార్చర్ చేసిన కేసులో నిందితుడు ఉన్న సునీల్‌కుమార్‌పై లెక్కలేనన్ని అభియోగాలు ఉన్నాయి. సీఐడీ నమోదు చేసిన అనేక తప్పుడు కేసుల్లో సునీల్ ప్రమేయం ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఆయనపై వచ్చిన అభియోగాలపై విచారణ అథారిటీని ఏర్పాటు చేసింది. ఈ అథారిటీలో రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, విజిలెన్స్ డీజీ హరీష్ కుమార్ గుప్తాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. సాధ్యమైనంత త్వరగా సునీల్ కుమార్‌పై ఉన్న అభియోగాలపై విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని పేర్కొంది.



## న్యూస్ లెటర్‌తో గురుకుల విద్యార్థుల్లో విజ్ఞానం

- మాసపత్రికను ఆవిష్కరించిన మంత్రి డోలా
- ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సెక్రటరీకి అభినందన

అమరావతి(చైతన్యరథం): న్యూస్ లెటర్ మాస పత్రిక గురుకులాల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు దోహదపడుతుందని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. గురుకుల విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ నూతనంగా రూపొందించిన న్యూస్ లెటర్ మాసపత్రికను శుక్రవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డోలా మాట్లాడుతూ న్యూస్ లెటర్ మాసపత్రికలో గురుకులాల విద్యార్థులు విద్య, క్రీడా రంగాల్లో సాధించిన విజయాలు, విద్యా సంబంధిత అంశాలు ఉంటాయన్నారు. దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం గతంలో ఏలూరు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ప్రైమ్ మినిస్టర్స్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ - 2023 అవార్డు సాధించిన ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సెక్రటరీ ప్రసన్న వెంకటేష్‌ను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీలు, గురుకులాల అకడమిక్ మానిటరింగ్ సభ్యులు పాల్గొన్నారు.



చైతన్యరథం

# చిరస్మరణీయుడు తారకరాముడు

## (స్వర్గీయ ఎన్టీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం)

నందమూరి తారక రామారావు. తెలుగు జాతికి పరిచయం అక్కర్లేని పేరు. ప్రపంచంలో ఏ మూలాన ఉన్న తెలుగువారికైనా 'అన్న' అనే పదం వినబడితే చాలు స్వర్గీయ నందమూరి తారక రామారావు స్ఫురణకు వస్తారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టిన మహనీయుడు ఆయన. సామాన్యుడుకి సగం ధరకే జనతా వస్త్రాలు కట్టబెట్టిన అసమాన్యుడు. అట్టడుగు వర్గాలవారికి పక్కాఇళ్ళు కట్టించిన ప్రజా నాయకుడు. పేదవాడికి కూడు, గూడు, గుడ్డ.. నినాదంతో దేశానికి సంక్షేమ పథకాల మార్గదర్శనం చేసిన దార్శనీకుడు. తెలుగు సినీరంగంలో అగ్రశ్రేణి నటుడుగా.. దర్శకునిగా.. నిర్మాతగా ప్రజా హృదయాలను గెలుచుకున్న ఎన్టీఆర్ రాజకీయాలలోను రాజీలేని తనదైన ముద్ర వేశారు. భౌతికంగా మనకు దూరమైనా.. తెలుగుజాతి గుండెల్లో చిరంజీవిగా కొలువయ్యారు.

1928 మే 28న కృష్ణా జిల్లా నిమ్మకూరులో సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన ఎన్టీఆర్.. సినీరంగంలో స్వయంశక్తితో ఎదిగి మకుటంలేని మహారాజుగా వెలుగొందారు. 1982లో తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల అనతికాలంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించి.. పాలనలో ఎన్నో సంస్కరణలు తెచ్చారు. మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన అధికారదర్పంతో కాకుండా పేదల పట్ల ఆర్తితో బాధ్యతలు నిర్వహించారు. 1996 జనవరి 18న తెలుగుజాతికి భౌతికంగా దూరమయ్యారు. తెలుగు సినిమా నటుడు, తెలుగుదేశం పార్టీ స్థాపకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రిగా తెలుగువారు "అన్నగారు" అని అభిమానంతో పిలుచుకొనే ఎన్.టి.రామారావు.. తెలుగు, తమిళం, హిందీ, గుజరాతీ భాషలలో కలిపి దాదాపు 303 చిత్రాలలో నటించారు. పలు చిత్రాలను నిర్మించి, మరెన్నో చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనేక పౌరాణిక, జానపద, సాంఘిక చిత్రాలలో వైవిధ్యభరితమైన పాత్రలెన్నో పోషించి మెప్పించారు. రాముడు, కృష్ణుడువంటి పౌరాణిక పాత్రలతో తెలుగు వారి హృదయాలలో శాశ్వతంగా, ఆరాధ్య దైవంగా నిలచిపోయారు ఎన్టీఆర్.

నందమూరి తారక రామారావు 1982 మార్చి 29న తెలుగుదేశం పేరిట రాజకీయ పార్టీని స్థాపించి కేవలం 9 నెలల్లోనే ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించారు. ఆ తరువాత మూడు దఫాలు, ఏడేళ్లపాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసి, అప్పటి వరకు అత్యధిక కాలం పని చేసిన ముఖ్యమంత్రిగా నిలిచారు.

1981లో ఊటీలో 'సర్దార్ పాపారాయుడు' చిత్రం షూటింగు విరామ సమయంలో ఒక విలేఖరి.. "మీకు ఇంకో 6 నెలల్లో 60 సంవత్సరాలు నిండుతున్నాయి కదా. మరి మీ జీవితానికి సంబంధించి ఏదైనా నిర్ణయం తీసుకుంటున్నారా?" అని అడిగారు. దానికి జవాబుగా.. "నేను నిమ్మకూరు అనే చిన్న గ్రామంలో పుట్టాను. తెలుగు ప్రజలు నన్ను ఎంతగానో ఆదరించారు. వారికి నేనెంతో రుణపడి ఉన్నాను. కాబట్టి నా తరువాతి పుట్టిన రోజునుంచి నా వంతుగా ప్రతీనెలలో 15 రోజులు తెలుగుప్రజల సేవ కోసం కేటాయిస్తాను" అని చెప్పారు. ఆయన చేయబోయే రాజకీయ ప్రయాణానికి అది మొదటి సంకేతం. అలా, 1982 మార్చి 21న హైదరాబాదు వచ్చినప్పుడు అభిమానులు ఆయనకు ఎర్రతివాచీ స్వాగతం పలికారు. 1982 మార్చి 29 మధ్యాహ్నం 2:30లకు కొత్త పార్టీ పెడుతున్నట్టు ప్రకటిస్తూ.. పార్టీకి తెలుగుదేశంగా నామకరణం చేశారు.

పార్టీ ప్రచారానికై సిద్ధం చేసుకున్న "చైతన్యరథం"పై చారిత్రక ప్రచార యాత్ర నిర్వహించి.. కాంగ్రెసు అధికారాన్ని కూకటివేళ్ళతో పెకలించి ప్రభంజనాన్నే సృష్టించారు. ఎన్టీఆర్ ప్రసంగాలు ఉద్వేగభరితంగా, ఉద్రేకపూరితంగా ఉండి ప్రజలను చైతన్యవంతులను చేసేవి. తెలుగువారి ఆత్మగౌరవ పునరుద్ధరణకే తాను రాజకీయాల్లోకి వచ్చానని ప్రకటించుకున్న మహనీయుడు ఎన్టీఆర్.

1983 జనవరి 7న మధ్యాహ్నం అప్పటి ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. తెలుగుదేశం 199, కాంగ్రెసు 60, సిపిఐ 4, సిపిఎం 5, బిజెపి 3 సీట్లు గెలుచుకున్నాయి. 97 ఏళ్ళ సుదీర్ఘ చరిత్రవున్న కాంగ్రెసు పార్టీ 9 నెలల తెలుగుదేశం పార్టీ చేతుల్లో ఓడిపోయింది. ఎన్టీఆర్ విజయానికి అప్పటి దినపత్రికలు ఎంతో తోడ్పడ్డాయి. 1984 ఆగస్టు 16న నాదెండ్ల భాస్కరరావు, అప్పటి గవర్నరు రాంలాల్, ప్రధానమంత్రి ఇందిరాగాంధీల లోపాయికారీ సహకారంతో రామారావును అధికారం నుండి తొలగించి, తాను దొడ్డిదారిన గద్దెనెక్కడంతో తిరిగి రామారావు ప్రజల్లోకి వెళ్ళారు. జరిగిన అన్యాయాన్ని ఎలుగెత్తి చాటారు. ఈ ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమంలో మిత్రపక్షాలు ఆయనకు సహకరించాయి. ఫలితంగా సెప్టెంబరు 16న రామారావును తిరిగి ముఖ్యమంత్రిగా ప్రతిష్ఠించడం కేంద్ర ప్రభుత్వానికి తప్పింది కాదు. నెలరోజుల్లోనే ఆయన ప్రభ తిరిగి శిఖరాగ్రానికి చేరిన సందర్భమది.

ఆంధ్రప్రదేశ్‌లో మొదటి కాంగ్రెసేతర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత ఆయన ఎన్నో కార్యక్రమాలు చేపట్టారు. ఆ కాలంలో ఎన్టీఆర్ తీసుకున్న పాలనా నిర్ణయాలు చెక్కుచెదరని చరిత్ర. 'సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు' అన్న నినాదంతో –ఆనాటి రాజకీయ పార్టీల పాలనా వైఖరికి భిన్నమైన నిర్వచనాన్ని ఇచ్చారు. ఎన్టీఆర్



పాలనా కాలంనుంచి మొదలైన సంక్షేమ పాలనా విధానమే.. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోవున్నా.. దేశంలోని అనేక రాష్ట్రాలు అనసరణీయ అంశంగా మారిపోయింది. ఆయన పాలనా ప్రభావంనుంచి బయటపడలేక.. ఇప్పటికే అదే విధానాల అనుసరణే కనిపిస్తోంది. అటు ప్రజా సంక్షేమాన్ని కొత్తపుంతలు తొక్కిస్తూనే..అభివృద్ధికి ఎన్టీఆర్ వేసిన బాటలు ఇప్పటికీ పునాధుల్లా నిలిచే ఉన్నాయంటే అతిశయోక్తి కాదు.

రాజకీయంగా ఎన్టీఆర్ తీసుకొన్న కొన్ని సాహసోపేత నిర్ణయాలు.. భారత రాజకీయ చరిత్రనుంచి చెరిపివేయలేనివిగా ఉన్నాయనడం అతిశయోక్తి కాదు. అందులో ప్రధానంగా –భారతదేశంలోని ప్రాంతీయ పార్టీలన్నిటినీ, కమ్యూనిస్టులతో కలిపి కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా నేషనల్ ఫ్రంట్ అనే సంకీర్ణాన్ని ఏర్పాటు చేయటంలో ఎన్టీఆర్ విజయం అసాధారణం. 1991లో నంద్యాల లోక్‌సభ ఉప ఎన్నికలలో కాంగ్రెసు తరపున అభ్యర్థిగా అప్పటి ప్రధానమంత్రి పివి నరసింహారావు నిలబడగా, ప్రధానమంత్రి అయిన ఒక తెలుగువాడికి గౌరవ సూచకంగా ఎన్టీఆర్ ఎవరినీ పోటీగా నిలబెట్టకపోవడం మరొకటి. ఇలాంటి అసాధారణ నిర్ణయాలు ఎన్టీఆర్ రాజకీయ చరిత్రలో లెక్కలేనన్ని.

1994లో కిలో బియ్యం రెండు రూపాయలు, సంపూర్ణ మద్య నిషేధం వంటి హామీలతో.. మునుపెన్నడూ ఏపార్టీ కూడా సాధించనన్ని స్థానాలు గెలిచి ఎన్టీఆర్ మళ్ళీ అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వ ఖజానాకు ఎంత భారం పడినా కూడా ఎన్టీఆర్ తన హామీలను అమలుపరిచారు. తాను స్థాపించిన తెలుగుదేశం పార్టీకి అసాధారణ ఖ్యాతినార్జించిపెట్టిన ఎన్టీఆర్ –1996 జనవరి 18న 73 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ముప్పైమూడేళ్ళ తెర జీవితంలోను, పదమూడేళ్ళ రాజకీయ జీవితంలోను నాయకుడిగా వెలిగిన ఎన్టీఆర్ చిరస్మరణీయుడు. నందమూరి తారక రామారావు జన్మదినం సందర్భంగా ఏటా మే 28న తెలుగుదేశం పార్టీ మహానాడును ఉత్సవంలా నిర్వహిస్తోంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు శతజయంత్యుత్సవాలు ఏడాదిపాటు వేడుకగా జరిగాయంటే.. రాష్ట్రంపై ఆయన ప్రభావం ఏపాటిదో అంచనా వేసుకోవచ్చు.

భారత ప్రభుత్వం వారిచే విడుదల చేయబడిన స్టాంపు, ఎన్టీఆర్ పేరిట సినిమా ప్రముఖులకు జీవిత కాలంలో చేసిన సేవకు గుర్తింపుగా ఎన్టీఆర్ జాతీయ పురస్కారాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1996లో నెలకొల్పింది. 2002 వరకు ఇస్తూ వచ్చిన ఈ అవార్డును ప్రభుత్వం తరువాత నిలిపివేసింది. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా 2006 జనవరి 18న పురస్కారాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సినీ, రాజకీయ రంగాలలో చెరగని ముద్ర వేసిన నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఎన్టీఆర్ 100 రూపాయల స్మారక నాణేన్ని 2023 ఆగస్టు 28న విడుదల చేసింది.

సిసలైన ప్రజానాయకుడు ఎన్టీఆర్.ఆంధ్రప్రదేశ్‌లో, అతను సమకాలికుల్లో ఆయనంతటి ప్రజానాయకుడు మరొకరు లేరు. వటవృక్షంలాంటి కాంగ్రెసు పార్టీకి ఆంధ్రప్రదేశ్‌లో దీటైన ప్రత్యామ్నాయాన్ని నిలబెట్టిన గొప్పదనం పూర్తిగా ఎన్టీఆర్‌దే. పట్టుదలకూ, క్రమశిక్షణకు మారుపేరైన మహనీయుడాయన. తెలుగుజాతికీ, తెలుగుభాషకూ దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన వ్యక్తి ఎన్టీఆర్.

తెలుగుగంగ ప్రాజెక్టులో పట్టుబట్టి రాయలసీమ సాగునీటి అంశాన్ని చేర్చిన ఘనత కూడా ఎన్టీఆర్‌దే. "నక్సలైట్లు కూడా దేశభక్తులే బ్రదర్" అంటూ సమర్థించటం ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమైంది. మహిళలకు ఆస్తి హక్కు, వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు, పురోహితులుగా ఎవరైనా ఉండవచ్చుననే అంశం ఆయన పాలనలో ఒక సెన్సేషన్.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అప్పటి దాకా రెడ్డి కులాలకే అన్ని రాజకీయ పదవులను కట్టబెట్టడంతో, ఎన్టీఆర్ మిగతా కులాలకు ఆశాకిరణంలా కనిపించారు. ఎన్టీఆర్ మొట్టమొదటిసారిగా అన్ని కులాలవారికీ, ముఖ్యంగా బడుగు బలహీన వర్గాల వారికి తెలుగుదేశం పార్టీలో ఉన్నత పదవులు కల్పించారు. ఆయన చేసిన కృషి ఫలితంగా ఈనాటికీ బడుగు, బలహీన వర్గాలు తెలుగుదేశం పార్టీకి అండగా ఉన్నాయి, ఉంటున్నాయి, ఉంటాయి కూడా.

- బోళ్ళ సతీష్ బాబు
మీడియా కో-ఆర్డినేటర్, తెలుగుదేశం పార్టీ.

# ఉక్కు సంకల్పానికి ఊపిరి

## ఇది నా జీవితంలో గుర్తుండిపోయే ఘటన

- **సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కళ్యాణ్, యువ మంత్రి లోకేష్ కృషి అనిర్వచనీయం**
- **టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు**
- **విశాఖ స్టీల్‌కు కేంద్ర ప్యాకేజీపై స్పందన**

అమరావతి (చైతన్యరథం): ఇది నా జీవితంలో శాశ్వతంగా గుర్తుండిపోయే రోజు.. అని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కోసం 11,500 కోట్ల రూపాయల ఆర్థిక ప్యాకేజీని ప్రకటించడం ఆహ్వానించ దగ్గ పరిణామని హర్షం వ్యక్తం చేశారు. ఇది విశాఖ ఉక్కు కర్మాగారానికి కొత్త ఊపిరి పోసిందనడంలో ఎలాంటి సందేహం అవసరం లేదన్నారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిపించి తనపై ఎన్నో బాధ్యతలు పెట్టిన గాజువాక ప్రజలకు, ప్రత్యేకించి ఉక్కు కార్మిక సోదరులకు తాను ఇచ్చిన హామీలో కొంతమేరకు నెరవేరుస్తున్నందుకు తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. నథింగ్ ఇస్ ఇంపాజిబుల్ అని రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ బోర్డులో కింద ట్యాగ్ లైన్ చెప్తుందని... అది ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ప్రకటించిన కేంద్రమంత్రి కుమారస్వామికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. మా ప్రభుత్వం అధికారంలోకి వస్తూనే దీనిపై స్పష్టత ఉక్కు కర్మాగారాన్ని మళ్ళీ పుంజుకునేలా చేస్తామని తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆనాడు గాజువాక మీటింగ్‌లో చాలా స్పష్టంగా చెప్పారని గుర్తు చేశారు. ఆ మాట నిలబెట్టుకునేందుకు ఆయన చేయని ప్రయత్నం లేదన్నారు. జనసేన అధినేత ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ ఉక్కు పరిశ్రమ దగ్గర సమావేశం నిర్వహించినపుడు కూడా ఇదే అంశాన్ని చాలా స్పష్టంగా చెప్పారన్నారు. రాష్ట్ర మంత్రి యువనేత నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో కూడా దీనిపై స్థిరమైన హామీని



ఇచ్చారన్నారు. ఈ ముగ్గురు తమ మాటను నిలబెట్టుకోవడానికి, పడిన శ్రమ, చేసిన కృషి అనిర్వచనీయమన్నారు. ప్రధానమంత్రి మోదీతో, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామితో, పలు దఫాలు కలిసిన ప్రతిసారీ చెవిలో గుడికట్టి గుర్తు చేశారన్నారు. సకాలంలో ప్యాకేజీ ఇప్పించేలా చేయడంలో సఫలీకృతులు అయ్యారన్నారు. వారందరికీ హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇదే సమయంలో కార్మికులకు మరోసారి హామీ ఇచ్చారు. కార్మికుల పక్షాన నిలబడి పోరాడడానికి, వారికి మేలు కలిగించే నిర్ణయాలు అమలు జరిగేలా చేయడానికి తాము ఉన్నామన్నారు. ఈ తరుణంలో కార్మికులు చిత్తశుద్ధితో స్టీల్ ప్లాంట్ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పనిచేయాల్సిన అవసరం, ఆవశ్యకత ఉందన్న విషయాన్ని విస్మరించ కూడదని పిలుపునిచ్చారు. చెప్పుడు మాటలు విని కార్మికులుగా కర్తవ్యానికి దూరంగా జరగవద్దని హితవు పలికారు. కేంద్ర ఉక్కు మంత్రి ప్రకటించినట్లుగా ఇది తొలి సహాయం మాత్రమేనన్నారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం సహాయం కొనసాగుతూనే ఉంటుందన్నారు. నిర్దేశించిన రెండేళ్లలోగా తిరిగి లాభాల బాటలో పయనించాలన్న ఉక్కు మంత్రిత్వ శాఖ సంకల్పం నెరవేర్చేందుకు ప్రతి ఒక్క కార్మికుడూ పట్టుదలతో శ్రమించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రాష్ట్రం.. ఈవీ తయారీ గమ్యస్థానం

- ఓర్వకల్లులో దేశంలోనే మొదటి ప్రైవేట్ ఎలక్ట్రికల్ వెహికల్ పార్క్
- మారనున్న దేశ ఈవీ తయారీ రంగం దశ, దిశ
- ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ పేరుతో ఏర్పాటు
- పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఏపీ ప్రభుత్వం ఎంఓయూ
- మంత్రి లోకేష్ సమక్షంలో సంతకాలు
- వచ్చే మార్చి చివరిలో శంకుస్థాపన



అమరావతి (చైతన్యరథం): దేశ విద్యుత్ వాహన (ఎలక్ట్రిక్ వెహికల్- ఈవీ) తయారీ రంగంలో మైలురాయిగా నిలిచిపోయే ఒప్పందాన్ని ఏపీ ప్రభుత్వం కుదుర్చుకుంది. ఈవీ తయారీ రంగానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గమ్యస్థానంగా నిలిపేందుకు మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న పట్టుదల, చేస్తున్న కృషి సత్ఫలితాలను ఇస్తోంది. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో దేశంలోనే తొలిసారిగా అతిపెద్ద ప్రైవేట్ ఎలక్ట్రికల్ వెహికల్ పార్క్ ఏర్పాటు కానుంది. 1200 ఎకరాల్లో ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ పేరుతో భారీ ఎలక్ట్రిక్ వెహికల్ పార్క్‌ను స్థాపించడానికి పీపుల్ టెక్ గ్రూప్ కంపెనీ అయిన పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శుక్రవారం మంత్రి లోకేష్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. ఈ ప్రైవేట్ ఈవీ పార్క్‌తో దేశ ఈవీ ఎకో సిస్టం దిశ, దశ పూర్తిగా మారనుంది. ఈవీల తయారీ రంగానికి ఏపీ ప్రధాన గమ్యస్థానంగా మారనుంది.

ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీని మొత్తం 1,800 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేస్తారు. ఈవీ తయారీ, అనుబంధ పరిశ్రమలకు అత్యాధునిక మౌలిక సదుపాయాలను అందించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తిగా కార్యాచరణలోకి వచ్చిన తర్వాత, ఈ పార్క్ 1.5 బిలియన్ డాలర్ల (13,000 కోట్లు) పెట్టుబడిని ఆకర్షిస్తుందని, 25,000 మందికి ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని భావిస్తున్నారు.

పార్క్ యాంకర్ యూనిట్‌గా, పీపుల్ టెక్ ఎంటర్‌ప్రైజెస్ రూ.300 కోట్ల పెట్టుబడితో ఎలక్ట్రిక్ టూ-వీలర్ (ఈ 2 డబ్ల్యు ) తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేస్తుంది. ఈ పార్క్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించి, ఈవీ పరిశ్రమ వృద్ధికి తోడ్పడుతుంది. ఈ పార్క్‌లో ఏర్పాటు చేయనున్న మౌలికసదుపాయాల్లో ఆర్ అండ్ డీ (పరిశోధన, అభివృద్ధి )కేంద్రాలు, టెస్టింగ్ ట్రాక్‌లు, ప్లగ్-అండ్-ప్లే ఇండస్ట్రియల్ స్పేస్‌లు, పరిశ్రమల కోసం రెడీమేడ్ ప్లాట్లు ఉన్నాయి.

వీటికి అదనంగా గృహనిర్మాణం, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, మాల్స్ వంటి సామాజిక మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది. ఓర్వకల్ ప్రాంత సమగ్ర అభివృద్ధికి బాటలు వేస్తుంది. ఇటీవల ప్రకటించిన ఇండిచిప్ సెమీకండక్టర్ ఫ్యాబ్ ప్రాజెక్ట్, ఓర్వకల్‌లో రాబోయే ఇతర పెట్టుబడులకు ఈ పార్క్ ప్రోత్సాహకంగా ఉంటుంది.

ఈ మేరకు రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల మంత్రి టీజీ భరత్ సమక్షంలో పీపుల్ టెక్ గ్రూప్ సీఈఓ టీజీ విశ్వ ప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక అభివృద్ధి బోర్డు (ఏపీఈడీబీ) సీఈఓ సాయికాంత్ వర్మ ఈ అవగాహన ఒప్పందంపై సంతకం చేశారు.

ఈ సందర్భంగా ఐటీ మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌ను నూతన తరం పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దార్శనికతను తాము ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధిలో ముందంజలో ఉండాలనే ఆంధ్రప్రదేశ్ నిబద్ధతను ఈ ఎంఓయూ ప్రతిబింబిస్తుందన్నారు. ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ..ఎలక్ట్రిక్ వాహనాల కోసం అభివృద్ధి చెందుతున్న ఎకో సిస్టంను సృష్టించడంలో ముఖ్యమైన ముందడుగుగా పేర్కొన్నారు. వేగవంతమైన పారిశ్రామిక వృద్ధిని సాధించేందుకు అత్యాధునిక విధానాల అమలు, ఇబ్బందులు లేని ప్రోత్సాహం అందించటంలో ఏపీ ప్రభుత్వ సామర్థ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ.. భారతదేశ ఈవీ విప్లవంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతుందన్నారు. ఇది కేవలం మౌలిక సదుపాయాల ప్రాజెక్టు మాత్రమే కాదు. గ్రీన్ మొబిలిటీ భవిష్యత్ విజన్‌ను ఆవిష్కరిస్తుంది. ఉద్యోగాల కల్పన, ఈవీ-సంబంధిత అనుబంధ పరిశ్రమల స్థాపనకు వీలు కల్పిస్తుందన్నారు.

పీపుల్ టెక్ గ్రూప్ సీఈఓ టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ దేశ ఈవీ రంగ ముఖచిత్రాన్నే సమూలంగా మార్చేసే ఈ ప్రాజెక్టుకు నాయకత్వం వహించడం తమకు గర్వకారణంగా ఉందన్నారు.. ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ దేశంలోని ప్రైవేట్ ఈవీ పార్కులకు బెంచ్‌మార్క్‌ను నిర్దేశిస్తుంది, తయారీ, ఆవిష్కరణ, ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో వ్యాపారం చేసేందుకు ఇక్కడి ప్రభుత్వం చూపిస్తున్న వేగం, సామర్థ్యం ఆదర్శప్రాయంగా ఉన్నాయి. నిర్ణయాలు తీసుకోవటంలో ఏపీ ప్రభుత్వ వేగానికి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

పీపుల్ టెక్ గ్రూప్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ, పార్క్, ఈ 2 డబ్ల్యు తయారీ యూనిట్ రెండింటికీ ఈ ఏడాది మార్చి నెలాఖరులో శంకుస్థాపన జరుగుతుందన్నారు.. మా ఫ్యాక్టరీ నుండి మొదటి ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనం 2026 డిసెంబర్ నాటికి విడుదల అవుతుందన్నారు. పార్క్‌లో తమ యూనిట్లను స్థాపించడానికి జాయింట్ వెంచర్ భాగస్వామ్యాల కోసం తైవాన్, కొరియా, చైనా నుండి ప్రముఖ బ్యాటరీ, డిస్‌ప్లే, మోటార్ నియంత్రణ తయారీదారులతో ముందస్తు చర్చలు జరుపుతున్నామని తెలిపారు.

మొత్తమ్మీద ఓర్వకల్ మొబిలిటీ వ్యాలీ ఆంధ్రప్రదేశ్‌లో ఆవిష్కరణలు, పారిశ్రామిక వృద్ధికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది, భారతదేశ ఈవీ ఎకో సిస్టం వ్యవస్థలో అగ్రగామిగా రాష్ట్ర స్థానాన్ని సుస్థిరం చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలకు దోహదపడుతుంది.

## సాగునీటి రంగాన్ని విధ్వంసం చేసింది జగనే

- గోదావరి, కృష్ణా జలాలపై మాట్లాడే అర్హత ఉందా?
- బెయిల్ కోసం ఆ హక్కులను కూడా కాలరాశారు
- నేడు అవినీతి పత్రికలో అసత్య కథనాలతో ప్రచారం
- ప్రాజెక్టులను గాలికొదిలిన ఆయనను రైతులు క్షమించరు
- జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం



అమరావతి(చైతన్యరథం): ఇరిగేషన్ రంగాన్ని విస్మరించి ప్రాజెక్టులను గాలి కొదిలి విధ్వంసం చేసిన జగన్‌కు గోదా వరి, కృష్ణా జలాలపై మాట మాట్లాడే అర్హత లేదని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. ఉండవల్లి లో సీఎం నివాసం వద్ద ఆయన విలేకరు లతో మాట్లాడారు. మీడియా ముసుగులో తన అవినీతి పత్రిక ద్వారా రోజూ అసత్య కథనాలతో ప్రజలను మభ్యపెట్టి మరో సారి రాష్ట్రాన్ని నాశనం చేసే ప్రక్రియలో భాగంగా పనిగట్టుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 2023లో ఆంధ్రా, తెలంగాణ జలాల పంపిణీపై రివ్యూ చేసి రీ ఆర్డర్ అధికారం తెచ్చింది, అంగీకరించింది జగన్ హయాంలోనేనని ప్రశ్నించే దమ్ము ఆయన అవినీతి నీలి మీడియాకు ఉందా? అని ప్రశ్నించారు. సెక్షన్ 3 ప్రకారం జలాల పంపిణీపై 2023లో ఆర్డరిస్తే 30మంది ఎంపీలు ఉన్న జగన్ ఎందుకునోరు విప్ప లేదు? తన స్వార్థం కోసం, కేసుల కోసం, బెయిల్ కోసం గోదావరి.. కృష్ణా జలాల హక్కులను సైతం వదులుకున్న జగన్‌ను రైతులు క్షమించరని హితవు పలి కారు. 18 నెలలు శ్రమించి నిర్మాణం పూర్తి చేసి న డయా ఫ్రమ్‌వాల్‌ను ధ్వంసం చేసింది, పోలవ రంలో ఫేజ్-1,ఫేజ్-2 అనిచెప్పి ద్రోహం చేసింది జగనేనని ధ్వజమెత్తారు. పోల వరం నీటి నిల్వ సామర్థ్యం, ఎత్తు 41.15మీటర్లు, 45.72 మీటర్లు అంటూ విభజించి పోలవరాన్ని ప్రశ్నార్థకం చేసింది జగన్ కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రం కోసం, భవిష్యత్ కోసం శ్రమిస్తూ రాష్ట్ర పునర్నిర్మాణం చేస్తున్న చంద్రబాబు పై బురద జల్లితే ప్రజలు జగన్‌ను క్షమించ రని హిత వుపలికారు.

## ఏపీలో అత్యాధునిక నౌకా నిర్మాణ పరిశ్రమ

- ప్రముఖ నిర్మాణ సంస్థల సహకారంపై దృష్టి
- ఏపీ మారిటైమ్ బోర్డు కీలక సమావేశం
- పాల్గొన్న గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ ప్రతినిధులు



అమరావతి(చైతన్యరథం): ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా రాష్ట్రాన్ని నౌకానిర్మాణం లో అగ్రగామిగా మార్చడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. 10 53 కిమీ తీర ప్రాంతం, అభివృద్ధి చెందిన ఓడరేవు నెట్‌వర్క్, వ్యూహాత్మక స్థానాలతో రాష్ట్రం ప్రపంచ నౌకానిర్మాణ గమ్యస్థానంగా మారడానికి అపారమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ఈ క్రమంలో గ్లోబల్ షిప్ బిల్డింగ్ హబ్‌గా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా కొద్ది రోజులుగా కీలక సమా వేశాలు జరుగుతున్నాయి. శుక్రవారం కూడా మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ సచివాలయంలోని తన కార్యాలయంలో రాష్ట్రంలో అత్యాధునిక నౌకా నిర్మాణ పరిశ్రమను అభివృద్ధి చేయడానికి అవకాశాలను చర్చించడానికి కీలక సమావేశం నిర్వహించారు. దేశాన్ని ప్రపంచంలోని టాప్ ఐదు నౌకానిర్మాణ దేశాలలో ఒకటిగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకున్న భారత ప్రభుత్వ మారిటైమ్ విజన్ 2047తో సమానంగా రాష్ట్రాన్ని గ్లోబల్ షిప్ బిల్డింగ్ హబ్‌గా తీర్చిది ద్దేలా నౌకా నిర్మాణం ఉంటుంది. దీనిని వేగవంతం చేయడానికి ఏపీ మారిటైమ్ బోర్డు గతంలో ఆంధ్రప్రదేశ్‌లో నౌకా నిర్మాణ పెట్టుబడుల కోసం ఆసక్తి వ్యక్తీ కరణ (ఈఓఐ) ద్వారా ప్రతిపాదనలను ఆహ్వానించింది.

ఏపీఎంబీ బృందం ఈ ఈఓఐ ద్వారా ప్రపంచంలోని ప్రముఖ నౌకానిర్మాణదారులను సంప్రదించింది. ఈ మార్కెట్‌లో చాలా మంది దృష్టిని ఆకర్షించింది. హ్యుందాయ్ హెవీ ఇండస్ట్రీస్, కొరియన్ నౌకానిర్మాణ దారులు ఆ సందర్భంలో ఏపీఎంబీతో పాలు పంచుకున్నారు.

నౌకా నిర్మాణంలో రాష్ట్ర సామర్థ్యంపై బలమైన ఆసక్తిని చూపించారు. సైట్ సందర్శనలు, చర్చలు కూడా జరిగాయి. షిప్ యార్డ్ అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌ను ఆశాజనకమైన గమ్యస్థానంగా వారు ఆసక్తి కనబరిచారు. శుక్రవారం జరిగిన సమావేశంలో భారతదేశంలోని ప్రముఖ నౌకానిర్మాణ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ ఇంజనీర్స్ (జీఆర్ఎస్ఈ)తో సహకార అవకాశాలను అన్వేషిం చడంపై సమావేశం దృష్టి సారించింది. జీఆర్ఎస్ఈ ప్రతినిధులు ఏపీఎంబీతో ఉత్పాదక చర్చలు కూడా జరిపారు. నౌకానిర్మాణ సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి సంభావ్య ప్రదేశాలను కూడా సందర్శించారు.

చైతన్యరథం

## యువతకు ఉద్యోగాలు, పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా..

# మంత్రి లోకేష్ దావోస్ టూర్!

- 20 నుంచి 24వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరు
- 5 రోజుల పర్యటనలో 50 మందికిపైగా ప్రముఖులతో సమావేశాలు
- 30 మంది దిగ్గజ పారిశ్రామికవేత్తలతో భేటీ
- మంత్రి లోకేష్ వైపు పారిశ్రామిక వర్గాల చూపు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పన, భారీ పెట్టుబడుల సాధనే లక్ష్యంగా పెట్టుబడుల టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్, రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ నెల 20 నుంచి 24వరకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సుకు హాజరుకానున్నారు. ఐదురోజులపాటు జరిగే ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన 50 మందికి పైగా అంబాసిడర్లు, పారిశ్రామిక వేత్తలు, పారిశ్రామికరంగ పెద్దలతో మంత్రి లోకేష్ భేటీ కానున్నారు. ప్రత్యేకించి ఏపీ పెవిలియన్‌లో ప్రపంచ వ్యాప్తంగా పేరెన్నికగన్న 30 మంది పారిశ్రామికవేత్తల తో ముఖాముఖి సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులపై చర్చలు జరుపుతారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యుఈఎఫ్) వేదికగా విద్యారంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులపై విద్యారంగ గవర్నర్ల సమావేశం (Education Governors meeting)లో పాల్గొంటారు. ఇంటిలిజెంట్ పరిశ్రమల కోసం మెరుగైన పర్యావరణ వ్యవస్థ నిర్మాణం (Building the Ecosystem for Intelligent Industries), అధునాతన యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ప్రభావం (AI energy impact), జెండర్ పారిటీ స్ప్రింట్ ఛాంపియన్స్ (Gender parity Sprint Champions) అంశాలపై ప్రముఖులతో నిర్వహించే సమావేశాలకు హాజరవుతారు. నెక్ట్స్ జెన్ ఎఐ, డేటా ఫ్యాక్టరీ, ఎఐ విశ్వవిద్యాలయం ఏర్పాటు అంశాలపై ఎన్ విడియా ప్రతినిధులు, ఎఐ ఫర్ గుడ్ గవర్నెన్స్ పై గూగుల్ సంస్థ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశాల్లో పాల్గొంటారు. గ్లోబల్ ఎకనామీ స్థితిగతులు – లేబర్ మార్కెట్‌పై ఎఐ ట్రాన్స్‌మిషన్ ప్రభావం (The Transmission impact of AI on Global



Economies & Labour Markets) అనే అంశంపై వైట్ షీల్డ్‌తో, భవిష్యత్తులో వాతావరణ ఉద్యమ ప్రభావంపై (What does the future hold for climate movement) అంశంపై స్వనీతి ఇనిషియేటివ్ ప్రతినిధులతో, వార్షిక లీడర్ ఫోరమ్ పునరుద్ధరణ (Renew Annual Leader Forum)పై నిర్వహించే సమావేశాలకు మంత్రి లోకేష్ హాజరు కానున్నారు. 5రోజుల సదస్సులో 30 మంది దిగ్గజ పారిశ్రామిక వేత్తలతో ముఖాముఖి సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా ఆహ్వానిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు గల అనుకూలతలు, మెరుగైన పర్యావరణ వ్యవస్థ, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వారికి వివరిస్తారు. సిఎన్‌బిసి, టివి 18, బిజినెస్ టుడే, ఎకనమిక్ టైమ్స్, బ్లూమ్ బర్గ్, మనీ కంట్రోల్ వంటి ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో ఇంటరాక్టివ్ సెషన్స్‌కు హాజరవుతారు. భారత్ – డెన్మార్క్ మధ్య గ్రీన్ స్ట్రాటజిక్ పార్టనర్ షిప్‌ను బలోపేతం చేయడంపై నిర్వహించే సదస్సుతోపాటు కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) నిర్వహించే కార్యక్రమానికి మంత్రి లోకేష్ అతిథిగా హాజరవుతారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్తున్న మంత్రి లోకేష్ వైపు పారిశ్రామికవర్గాలు ఆసక్తితో ఎదురుచూస్తున్నాయి.

## ఉక్కు రెక్కల ఆయుధాలతో

# కొత్త శిఖరాలకు



- విశాఖ ఉక్కుపై హామీ నిలబెట్టుకున్నాం
- ప్రత్యేక ప్యాకేజీతో స్టీల్‌ప్లాంట్‌కు మంచిరోజులు
- ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, కుమారస్వామి, నిర్మలా సీతారామన్‌కు కృతజ్ఞతలు
- సీఎం చంద్రబాబు ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనం
- మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్యరథం): విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కును కాపాడుకుంటామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. విశాఖ ఉక్కుకు కేంద్రం ప్యాకేజీ ప్రకటించటంపై లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. కష్టాల్లో కూరుకుపోయిన విశాఖ ఉక్కు కర్మాగారానికి కేంద్రం ప్రకటించిన రూ.11,440 కోట్ల ప్యాకేజీ పూర్వవైభవం తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఉక్కు రెక్కల ఆయుధాలతో ఏపీ కొత్త శిఖిరాలకు ఎదుగుతుందన్నారు. ఇది లక్షలాది జీవితాలను మార్చే మంచి నిర్ణయం. కేంద్రం ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు పూర్వవైభవం వస్తుంది. విశాఖ ఉక్కును కాపాడతామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. దానిని నిలబెట్టుకు నేందుకు ఆయన చేసిన కృషిని దగ్గర నుంచి చూశా. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం చిత్తశుద్ధికి ఇది నిదర్శనం. లక్షల మందికి ఉపాధినిచ్చే ప్లాంట్‌ను ఆదుకున్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, మద్దతు ఇచ్చిన కేంద్ర ఆర్థికమంత్రి ర్మలాసీతారామన్, ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఇది ఆత్మగౌరవం కోసం పోరాడిన విశాఖ ఉక్కు కార్మికుల విజయం.గత ఐదేళ్ల పాలనలో జగన్‌రెడ్డి అధికారాన్ని సొంత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడంచూశాం. కేవలం అధికారం చేపట్టిన ఏడు నెలల్లోనే కేంద్రాన్ని ఒప్పించి ప్రత్యేక ప్యాకేజీ సాధించిన ప్రజా నేత చంద్రన్న పాలనలో రాష్ట్రానికి జరుగుతున్న మేలు కళ్లారా చూస్తున్నాం. సాహెూ నమో... సాహెూ చంద్రన్న అని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## మంత్రి లోకేష్ ఆదేశాలతో

# దుర్గగుడిలో తీరిన తాగునీటి సమస్య

- ప్రసాదం కౌంటర్ వద్ద తాగునీరు అందుబాటులో లేదని భక్తుల అసహనం
- ఎక్స్ ద్వారా మంత్రి లోకేష్ దృష్టికి ఇబ్బందులు
- భక్తులను క్షమాపణలు కోరిన మంత్రి
- తక్షణమే స్పందన, మంత్రి ఆదేశాలతో సమస్యకు వెంటనే పరిష్కారం

అమరావతి (చైతన్యరథం): విజయవాడ కనకదుర్గమ్మ గుడి ప్రాంగణంలో తలెత్తిన తాగునీటి సమస్యను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో సంబంధిత అధికారులు వెంటనే పరిష్కరించారు. ప్రసాదం కౌంటర్ వద్ద నెలకొన్న తాగునీటి సమస్యపై మంత్రి లోకేష్ తక్షణమే స్పందించటంతో అధికారులు రంగంలోకి దిగి భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. శుక్రవారం ఉదయం దుర్గగుడిలోని ప్రసాదం కౌంటర్ వద్ద తాగునీరు అందుబాటులో లేదని ఎక్స్ ద్వారా భక్తులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. సరైన నిర్వహణ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్.. భక్తులకు కలిగిన అసౌకర్యంపై క్షమాపణలు చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తన టీం ద్వారా సమస్యను సంబంధిత శాఖ దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి




ఆదేశాలతో తక్షణమే రంగంలోకి దిగిన అధికారులు.. భక్తులకు కావాల్సిన మంచినీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో మంత్రి చొరవ పట్ల భక్తులు ధన్యవాదాలు తెలిపారు.

# కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

- విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తెస్తాం
- భారీ మొత్తంలో నిధులు కేటాయించిన ప్రధానికి కృతజ్ఞతలు
- ప్లాంట్ ఆస్తుల కబ్జాకు గత పాలకుల కుట్రలు
- వైసీపీ నేతలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి
- మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి (చైతన్యరథం): విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.11,400 కోట్లతో కేంద్రం పునరుజ్జీవ ప్యాకేజీ ప్రకటించడం పట్ల రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు. ఎక్సైజ్ శాఖల మంత్రి కొల్లు రవీంద్ర హర్షం వ్యక్తం చేశారు. ఇంత భారీ స్థాయిలో నిధులు కేటాయించడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఉత్తరాంధ్ర మణిహారం విశాఖ ఉక్కు పరిశ్రమకు ప్యాకేజీ ప్రకటించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. గత పాలకులు విశాఖ ఉక్కుని నాశనం



చేసేందుకు కుట్రలు చేశారు. స్టీల్ ప్లాంట్ ఆస్తుల్ని కబ్జా చేసేందుకు పోస్కో కంపెనీతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ మొత్తాన్ని నాశనం చేసేందుకు కుట్రలు చేసినట్లు మాజీ సీఎస్ స్వయంగా బయటపెట్టారు. కూటమి అధికారంలోకి రాగానే విశాఖ కేంద్రంగా రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులకు శ్రీకారం చుట్టాం. ఇప్పుడు విశాఖకు తలమానికంగా నిలిచే విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకోవడానికి రూ.11,400 కోట్లు సాధించాం. విశాఖ ఉక్కు విషయంలో కూటమి ప్రభుత్వ చొరవ పట్ల ఉక్కు దిగ్గజం ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుట్రలు చేయడం తప్ప అభివృద్ధి చేతకాని వైసీపీ నేతలు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. జగన్ అండ్ కో.. రాజధాని పేరుతో విశాఖలో లూటీ చేశారు. రుషికొండకు బొడుగుండు కొట్టి ప్రజల సొమ్ముతో జల్సా చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన రోజు నుండి అభివృద్ధిపై దృష్టి పెట్టాం. ప్రజల కోసం ఆలోచించే వారికి.. ప్రజల్ని పీక్కు తినేవారికి తేడాను ప్రజలు తెలుసుకున్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.

# మాటిచ్చిన మర్నాడే సాయం

- సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి 11మందికి సాయం
- లబ్ధిదారులకు చెక్కులు అందించిన జిల్లా కలెక్టర్
- బాధితుల కళ్లలో ఆనంద బాష్పాలు
- ముఖ్యమంత్రికి మనసారా ధన్యవాదాలు



ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి 11మందికి సుమారు రూ. 34.50 లక్షల ఆర్థిక సాయం చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే పులివర్తి నాని.

తిరుపతి (చైతన్య రథం): కష్టాల్లోవున్న బీదా బిక్కికి నేనున్నానంటూ మాటిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. 24 గంటలు తిరగకముందే మాట నిలుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లె వెళ్లిన సీఎం చంద్రబాబు, అక్కడ తనను కలిసి కష్టాలు చెప్పుకున్న బాధిత వర్గానికి ఆపన్నహస్తం అందించారు. చంద్రగిరి, రామచంద్రపురం, తిరుపతి రూరల్, పులిచెర్ల దొరవారి సత్రం మండలాలకు చెందిన 11మందికి ముఖ్యమంత్రి సహాయ నిధినుంచి రూ.34.5 లక్షల ఆర్థిక సాయం అందించి బాధితులను ఆదుకున్నారు. కష్టం చెప్పుకున్న వెంటనే ఆర్థిక సహకారం అందించి ఆదుకున్న ముఖ్యమంత్రి చల్లగా ఉండాలని బాధితవర్గం ఆనందం వ్యక్తం చేసింది. లబ్ధిదారులకు కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జేసీ శుభం బన్సల్ చెక్కులు అందించారు.

### లబ్ధిదారుల స్పందన

వెన్నెముక సమస్యతో 13 నెలల నా బిడ్డ పడుతున్న యాతన, మా కుటుంబ ఆర్థిక పరిస్థితిని సొంతూరికి వచ్చిన సీఎం దృష్టికి తీసుకెళ్లాను. తక్షణం స్పందించిన సీఎం చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3 లక్షలు మంజూరు చేశారని, ఆయన ఆశీర్వాదంతో బిడ్డ ఆరోగ్యం కుదుటపడుతుందన్న నమ్మకంతో ఉన్నామని ఉద్వేగంగా చెప్పారు రామచంద్రపురం మండలం సి.రామాపురానికి చెందిన కె లావణ్య. సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. పక్షవాతంతో ఇబ్బంది పడుతూ.. ఇప్పటికే ఆస్పత్రులు చుట్టూ తిరిగి ఆర్థికంగా దెబ్బతిన్న తన పరిస్థితిని చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణం రూ.లక్ష మంజూరు చేశారని.. అది తన ఆరోగ్యానికి ఎంతో విలువైన సాయంగా చంద్రగిరి మండలం ఐతేపల్లి గ్రామానికి చెందిన ఎ పట్టాభి రెడ్డి వివరించారు.

తన కుటుంబ దీనస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లినపుడు తన భర్త వైద్యానికి, ఇంటి మరమ్మతులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షలు సాయంచేసి చంద్రబాబు పెద్ద మనసు చాటుకున్నారని చంద్రగిరి మండలం నారావారిపల్లెకు చెందిన నాగరత్నమ్మ ఆనందం వ్యక్తం చేశారు. షుగర్ వ్యాధితో ఇబ్బందిపడుతూ ఆర్థికంగా సతమతమవుతున్న తనకు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3లక్షల ఆర్థిక సాయం అందించారని చంద్రగిరి మండలం ఎ రంగంపేట గ్రామవాసి సందీప్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. క్యాన్సర్‌తో సతమతమవుతున్న తనకు రూ.5లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి కేటాయించారని తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు గ్రామస్థుడు ఆర్ రాధాకృష్ణయ్య వెల్లడించారు. బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ చేయించుకుని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తనకు రూ.4లక్షల ఆర్థిక సాయం చేసి సీఎం చంద్రబాబు పెద్ద మనసు చాటుకున్నారని చంద్రగిరి మండలం కందులవారిపల్లి గ్రామస్థుడు వాసుదేవనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. రోజువారి కూలితో జీవనాన్ని గడుపుతున్న తమ కుటుంబంలో భర్త సుబ్రహ్మణ్యం లివర్ క్యాన్సర్‌తో బాధ పడుతున్న విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లినపుడు.. సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి తక్షణం రూ.4 లక్షలు కేటాయించడాన్ని జీవితంలో మర్చిపోలేమని చంద్రబాబుకు చంద్రగిరి మండలం కందులవారిపల్లి మహిళ శారద ధన్యవాదాలు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అదే గ్రామవాసి దామోదర్ నాయుడికి రూ.2 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్‌నుంచి అందించారు. కొడుకు రోడ్డు ప్రమాదానికి గురై అదరవులేని పరిస్థితిలో వృద్ధ జీవితం గడుపుతున్న తమ పరిస్థితి చూసి చలించిపోయిన ముఖ్యమంత్రి తక్షణం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2లక్షలు మంజూరు చేసినట్టు మామండూరు గ్రామానికి చెందిన ఆదిలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. హృద్రోగ సమస్యతో బాధ పడుతున్న తన పరిస్థితిని చంద్రబాబుకు విన్నవించుకున్నపుడు.. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3.5లక్షలు అందచేసినట్టు చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కమ్మపల్లికి చెందిన మనోరంజని వివరించారు. అనారోగ్యంతోవున్న భర్తను రక్షించుకోవడానికి ఆస్తులన్నీ వెచ్చించినా ఫలితం దక్కలేదని, ఆర్థికంగా పూర్తిగా చితికిపోయిన తన కుటుంబానికి మెడికల్ బిల్లు రీయింబర్స్‌మెంట్ ద్వారా రూ.5లక్షలు సాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు దొరవారిసత్రం మండలం పూలతోట గ్రామానికి చెందిన వి అరుణ ధన్యవాదాలు తెలిపారు. నిరుపేదల కష్టం అర్థం చేసుకుని తక్షణ సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు చల్లగా ఉండాలంటూ లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

# కేంద్రం చిత్తశుద్ధికి నిదర్శనం

- భారీ ప్యాకేజీతో విశాఖ ఉక్కుకు పూర్వవైభవం
- ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి కుమారస్వామికి ధన్యవాదాలు
- ఇది సమష్టి పోరాట ఫలితం
- తెలుగువారికి నిజమైన సంక్రాంతి కానుక
- ఉద్దీపన ప్యాకేజీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం




ఢిల్లీ (చైతన్యరథం): విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక ప్యాకేజీపై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజల ఆకాంక్షల పట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు కేంద్రం రూ.11.440 కోట్ల ప్యాకేజీ ప్రకటించటంపై కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరపున రామ్మోహన్ నాయుడు ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్ర రాష్ట్ర ప్రగతికి అహర్నిశలు పాటుపడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి, ఈ పునరుద్ధరణ ప్యాకేజీని సాధించడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమార స్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ఎన్నోఏళ్ల సమస్యల పరిష్కారానికి అడుగులు

ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. ఉక్కు పరిశ్రమ నష్టాలను అధిగమించేందుకు ఈ ప్యాకేజీ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఉక్కు పరిశ్రమ పూర్తి స్థాయి ఉత్పాదకతతో లాభాల బాటలో పయనించేందుకు ఈ ప్యాకేజీ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ అభివృద్ధి, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలపట్ల కేంద్ర ప్రభుత్వ చిత్తశుద్ధికి ఈ ప్యాకేజీ ఓ నిదర్శనమని రామ్మోహన్ నాయుడు వివరించారు.

### ఇది అందరి విజయం

11,400 కోట్ల ప్యాకేజీతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు ప్యాకేజీ ప్రకటించటం గొప్ప సందర్భం. ఇది కేవలం ఒక ఆర్థిక నిర్ణయం కాదు, ఇది మన కార్మికుల విజయం, మన గర్వానికి చిహ్నం, పట్టుదల, నిబద్ధతకు నిదర్శనం. ఈ విజయానికి వెన్నెముకగా నిలిచిన వైజాగ్ స్టీల్ ప్లాంట్ కార్మికులను నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను. ఇది వారి అచంచలమైన స్ఫూర్తికి, మొక్కవోని దీక్షతో భవిష్యత్తు కోసం పోరాడిన ప్రతి ఒక్కరి సమష్టి కృషికి లభించిన విజయంగా భావిస్తున్నాను. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఇచ్చిన కీలకమైన వాగ్దానాన్ని నెరవేరుస్తూ ఎన్డీయే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని మరోసారి రుజువు చేసింది. గత ఐదేళ్లుగా, వైజాగ్ స్టీల్ ప్లాంట్, సౌత్ కోస్ట్ రైల్వే జోన్ సమస్యలను పార్లమెంట్‌లో అవిశ్రాంతంగా లేవనెత్తాను, వినతులు సమర్పించాను, న్యాయం కోసం అలుపెరుగకుండా పోరాడాను. కేవలం ఒక వారం వ్యవధిలో, మేము రెండు ప్రధాన విజయాలను సాధించాం. సౌత్ కోస్ట్ రైల్వే జోన్‌కు ప్రధాని మోదీ శంకుస్థాపన, ఇప్పుడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణ ప్యాకేజీ ప్రకటన. ఐకమత్యం, దృఢ సకల్పంతో పోరాడి సాధించిన ఈ విజయం ప్రతి తెలుగు వారికి నిజమైన సంక్రాంతిని తెచ్చింది. తెలుగు జాతికి కానుకగా నిలుస్తుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

### దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుంది: కుమారస్వామి

విశాఖ స్టీల్‌ప్లాంట్ రెండేళ్లలో ఉక్కురంగంలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుందని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి అన్నారు. 1993లో రూ.8,900 కోట్లతో 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరిగింది. 3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచినపుడు బాగానే ఉంది. 2014లో 6.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో విస్తరణ జరిగింది. విస్తరణ కోసం బ్యాంకుల నుంచి రూ.11వేల కోట్ల రుణం తీసుకున్నారు. 2014కు ముందు వరకు స్టీల్ ప్లాంట్ లాభాల బాటలోనే నడిచింది. గతంలో వాజ్‌పాయ్ హయాంలోనూ ఈ ప్లాంటుకు నిధులు కేటాయించారు. మోదీ హయాంలో స్టీల్ ప్లాంట్ కు నవరత్న హోదా వచ్చింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సందర్శించి వచ్చాక బ్యాంకులతో సమీక్షించా. ప్లాంట్‌కు సహాయ సహకారాలు అందించాలని కోరితే.. అందుకు బ్యాంకులు అంగీకరించలేదు. ప్లాంట్ పునరుజ్జీవానికి ఆర్థికమంత్రి తో ప్రధాని కార్యాలయం (పీఎంవో)తో చర్చించా. పీఎంవోలో చర్చల తర్వాత సత్ఫలితాలు రావడం మొదలైంది. స్టీల్ ప్లాంటుకు సహాయ, సహకారాలు అందించాలని ప్రధాని నిర్ణయించారు. పీఎంవోతో చర్చల తర్వాత సెప్టెంబరులో రూ.500 కోట్లు విడుదల చేశాం. 2024 అక్టోబరు 9న ఆర్థిక సాయానికి కేంద్ర ఆర్థికమంత్రి అంగీకరించారు. ఆర్థిక మంత్రి సూచనలతో ఎస్‌బిఐ నేతృత్వంలోనే కమిటీ వేశాం. కమిటీ నివేదికపై మంత్రుల కమిటీ చర్చల తర్వాత రూ.11,440 కోట్ల ప్యాకేజీకి నిర్ణయం తీసుకున్నాం. ప్లాంట్ పునరుద్ధరణను మంత్రివర్గం సవాల్‌గా తీసుకుంది. 3 ఫర్నేస్‌ల ద్వారా 92.3శాతం ఉత్పత్తి సామర్థ్యం లక్ష్యం. ఈనెలలో ప్లాంట్ సామర్థ్యం 14వేల టన్నులకు చేరుతుంది. ఈ ఏడాది జులై–ఆగస్టు నాటికి 3 ఫర్నేస్‌ల ద్వారా ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్లాంట్ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలుస్తుంది. ప్రస్తుతం విశాఖ స్టీల్ ప్లాంట్ రూ.35వేల కోట్ల అప్పుల్లో ఉంది. బ్యాంకు రుణాలు, వడ్డీ, ముడిసరుకు సరఫరాకు చెల్లింపులు చేయాల్సి ఉంది. స్టీల్ ప్లాంట్‌ను అప్పుల్లో నుంచి బయటకు తేవడమే ప్రథమ కర్తవ్యం. పూర్తి స్థాయిలో ప్లాంట్ పునరుద్ధరణ తర్వాత సెయిల్లో విలీనంపై యోచిస్తామని కుమార స్వామి తెలిపారు.

### హామీ నిలబెట్టుకున్న ఎన్డీయే ప్రభుత్వం: శ్రీనివాసవర్మ

ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎన్డీయే ప్రభుత్వం నిలబెట్టుకుందని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. ప్లాంటు కార్మికులు, కుటుంబాలకు భద్రతే ధ్యేయంగా కేంద్రం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్లాంట్‌ను మరింత సమర్థంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఏపీ ప్రజలు ఉద్యమాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని గుర్తు చేస్తూ, ఇప్పుడు కూడా అదే పోరాటస్ఫూర్తితో ప్లాంట్‌ను కాపాడుకున్నారని పేర్కొన్నారు.

# అత్తింట్లో పెట్రోల్ పోసి నిప్పంటించారు

- పెళ్లి పేరుతో మోసగించి హత్యాయత్నం
- పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువు
- ప్రజావినతుల్లో బాధితురాలి కన్నీటిపర్యంతం
- అర్జీలు స్వీకరించిన నక్కా ఆనంద్‌బాబు, రాంప్రసాద్
- సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



మంగళగిరి(చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా కోలమూరుకు చెందిన దివ్యశేఖర్ ఎస్టీ కులానికి చెందిన తనను నమ్మించి పెళ్లి చేసుకుని హత్యాయత్నానికి కుట్ర పన్నాడని బాధిత వివాహిత శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేసింది. ఆరు నెలలు కాపురం చేసి తన దగ్గర ఉన్న డబ్బులు మొత్తం వ్యాపారం కోసమని ఖర్చు పెట్టించడమే కాక దివ్యశేఖర్ అతడి కుటుంబసభ్యులతో కలిసి బ్లేడ్‌లతో గాయపరిచి పెట్రోల్ పోసి నిప్పంటించారని కన్నీటిపర్యంతమైంది. తన శరీరం తీవ్రంగా కాలిపోయిందని.. దోషులను కఠినంగా శిక్షించాలని దోషులను శిక్షించి తనకు న్యాయం చేయాలని పోలీసు అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం తన గోడు వెళ్లబోసుకుంది. తాను కొలమూరులో తిరిగితే చంపేస్తానని దివ్యశేఖర్ వారి కుటుంబసభ్యులు బెదిరిస్తున్నారని తెలిపింది. బెదిరింపులకు సంబంధించి ఆధారాలు కూడా తన వద్ద ఉన్నాయని పేర్కొంది. తనను చంపేందుకు యత్నించిన వారిని కఠినం గా శిక్షించి తనకు రక్షణ కల్పించాలని కోరింది. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు, బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ అర్జీలు స్వీకరించారు. బాధిత మహిళకు న్యాయం జరిగేలా చూస్తామని భరోసా ఇచ్చారు. సంబంధిత అధికా రులతో మాట్లాడి విచారించి దోషులకు కఠిన శిక్ష పడేలా చూడాలని ఆదేశించారు.

– గుంటూరు జిల్లా పెద్ద నెమలిపురి గ్రామానికి చెందిన శంకరయ్య అనే వ్యక్తి తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్ లైన్ చేయమంటే అధికారులు పట్టించు కోవడం లేదని ఫిర్యాదు చేశారు. తన భూమిని మరొకరు కబ్జా చేయాలని చూస్తున్నారని , తమ భూమిని తమకు ఆన్‌లైన్ చేయాలని విన్నవించుకున్నాడు.

– గత ప్రభుత్వంలో తమ భూమిని వైసీపీ నాయకుడు ఆక్రమించుకున్నాడని చిత్తూరు జిల్లా విజయపురి మండలం కాళికాపురం గ్రామానికి చెందిన కె.వీర రాఘవులు ఫిర్యాదు చేశాడు. దీనిపై అధికారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, సర్వే చేసి తన భూమి తనకు అప్పగించాలని విజ్ఞప్తి చేశాడు.

– విజయవాడ కృష్ణలంకకు చెందిన యశ్వంత్‌రెడ్డి, వీరాస్వామిలు తన వద్ద అప్పుగా రూ.17 లక్షలు డబ్బులు తీసుకుని తిరిగి ఇవ్వమంటే ఇవ్వకుండా ఇబ్బంది పెడు తున్నా రని గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లికి చెందిన కూనపరెడ్డి రమేష్ ఫిర్యా దు చేశాడు. వారిపై చర్యలు తీసుకుని తన డబ్బు ఇప్పించాలని వేడుకున్నాడు.

– తాము ధర్మారావు కోఆపరేటివ్ షుగర్స్ లిమిటెడ్ కంపెనీలో పనిచేసిన సమ యంలో 2013 నుంచి 2022 వరకు రావాల్సిన జీతాలు ఇంకా రాలేదని పెండింగ్ జీతాలు ఇప్పించి ఆదుకోవాలని పలువురు వేడుకున్నారు.

– తన జీవనోపాధికి ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించి సాయం చేయాలని నం ద్యాల జిల్లా ఆత్మకూరు గ్రామం నల్లకాలువ గ్రామానికి చెందిన శాబోలు పెద్ద వెంక టస్వామి వినతిపత్రం ఇచ్చాడు.


– తనకు పక్షవాతంతో చేతలు కాళ్లు పనిచేయడం లేదని తనకు పింఛన్ ఇచ్చి ఆదుకోవాలని గుంటూరు జిల్లా నందివెలుగు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగాదేవి వేడుకుంది.





# స్వర్ణాంధ్ర సాధనకు కలిసి పనిచేస్తాం

- ఏపీకి సాంకేతిక సహకారం అందిస్తాం
- తమ సేవలను వినియోగించుకోండి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన ఎన్ఐఎస్‌జీ
- ఆర్టీజీఎస్‌లో అధికారులతో సమావేశం



అమరావతి(చైతన్యరథం): ఏపీతో కలిసి పనిచేయడానికి తాము ఎంతో ఆసక్తితో ఉన్నామని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ (ఎన్ ఐఎస్‌జీ) సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాజీవ్ బన్సల్ తెలిపారు. ప్రభుత్వ శాఖలకు కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. శుక్రవారం సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్)లో ఎన్ఐ ఎస్‌జీ సంస్థ ప్రతినిధుల బృందం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమావేశమైంది. ఈ సందర్భంగా రాజీవ్ భన్సల్ మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ స్మార్ట్ గవర్నెన్స్ సంస్థ ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ సహా వివిధ రాష్ట్రాల్లో చేపడుతున్న వివిధ కార్యకలాపాల గురించి కూలంకుషంగా వివరించారు. ఆయా రాష్ట్రాలకు వారి అవసరాలను బట్టి ఈ-గవర్నెన్స్, స్ట్రాటజీ ప్లానింగ్, డిజైనింగ్ తదితర రంగాల్లో సహకారం అందించడంతో పాటు ఆధునిక సాంకేతిక ప్రపంచంలో వస్తున్న సరికొత్త టెక్నాలజీలను ప్రభుత్వాలు సమర్థవంతంగా వినియోగించుకోవడానికి అవసరమైన సహకారం తాము అందిస్తామని చెప్పారు. తమది ఎలాంటి లాభాపేక్ష లేని సంస్థ అని తెలిపారు. తక్కువ ఖర్చుతోనే ప్రభు త్వానికి తాము కన్సల్టెన్సీ సర్వీసులు అందిస్తామని చెప్పారు. గత రెండు దశాబ్దాలలో తమ సంస్థ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. 30 వేల మందికి పైగా వివిధ స్థాయిలలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చామని, 200లకు పైగా ప్రాజెక్టులను వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తమ సంస్థకు మొట్టమొదటి ప్రమోటర్‌గా పనిచేసిందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంతో మరింత దృఢమైన భాగస్వామ్యం ఏర్పరచుకుని విస్తృ తంగా కార్యకలాపాలు నిర్వహించాలని, ఏపీ ప్రభుత్వానికి కావాల్సిన సాంకేతిక సహకారం అందించాలని తమ సంస్థ ఎదురుచూస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా రూపొందించిన స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో కూడా కావాల్సిన సాంకేతిక సహకారం అందించడానికి తాము ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్ఐఎస్‌జీతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉం దన్నారు. ప్రభుత్వ శాఖలు తమ కార్యకలాపాలు అమలు చేసే సందర్భంలో ఎదురయ్యే సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అవసరమని, ఆ దిశగా ఈ సంస్థ సహకారం అందించాలని కోరారు. పెట్టుబడులు మౌలిక సదుపాయాల కల్పన శాఖ ముఖ్య కార్యద ర్శి ఎస్.సురేష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇప్పటికే డీప్ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తదిరత రంగాలపై చాలా చురుగ్గా పనిచే స్తోందని, ఈ దిశగా ఎన్ఐఎస్‌జీ సహకారం కూడా తీసుకుంటామన్నారు. ఐటీ కార్యదర్శి ఎన్.యువరాజ్ మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో అమరావతిలో కూడా ఎన్ఐఎస్‌జీ ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకుంటే సముచితంగా ఉంటుందని సూచించగా దానికి ఆ సంస్థ ప్రతినిధుల సానుకూలంగా స్పందించారు. అంతకుముందు ఎన్ఐఎస్‌జీ సీఈ వో, ఆ సంస్థ ప్రతినిధుల బృందంతో సమావేశానికి ఆర్టీజీఎస్ సీఈవో కె.దినేష్‌కుమార్ స్వాగతం పలికారు.

## స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం

●కేంద్ర ప్రభుత్వ ప్రకటనపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గణబాబు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ పశ్చిమ నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం హిమాచల్ నగర్ తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రభుత్వ విప్ నియోజకవర్గ శాసనసభ్యులు గణబాబు మీడియా సమావేశం నిర్వహించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాదానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్లాంట్ అభివృద్ధికి అందులో పనిచేసే ఉద్యోగుల భద్రత కూటమి సర్కార్‌దేనని అన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, ఈ మేరకు కేంద్రం రివైవల్ ప్యాకేజీ కింద పదివేల మూడు వందల కోట్లు ఇచ్చేందుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలపడం నిజంగా హర్షించదగ్గ విషయమన్నారు. ప్లాంట్ ఉనికికి మరోసారి జీవం పోసిన ప్రధాని మోదీ మరియు సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం కుటమి నాయకులు భారీ టపాసులు పేల్చారు. నిజంగా పండుగ సంక్రాంతి ఈ ప్రకటనతోనే తెలుగు రాష్ట్రాల్లో వచ్చిందంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, జీవీఎంసీ 63వ వార్డ్ కార్పొరేటర్ జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ గల్లా చిన్న, 62వ వార్డు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నీలాపు జోగి, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విశాఖ టీడీపీ కార్యాలయంలో సంబరాలు

●కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన నేతలు

●ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి పలిచిందంటూ ఆనందం వ్యక్తం



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ ఉక్కు కర్మాగారంకు కేంద్ర ప్రభుత్వం రూ.11,500 కోట్ల ఆర్థిక ప్యాకేజీ పక్రటించడం సంతోషించదగ్గ విషయమని విశాఖ టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారంకు కేంద్రం ప్యాకేజీ ప్రకటించిన సందర్భంగా శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి టీడీపీ నేతలు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఇది ఏపీ ప్రజలు గర్వించదగ్గ విషయం. విశాఖ ఉక్కు అంటే కేవలం పరిశ్రమ మాత్రమే కాదు. విశాఖ ఉక్కు కు ఆంధ్రుల హృదయాల్లో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్ర ప్రజలకు ఇకపై అన్నీ మంచి రోజులేనని అన్నారు. లక్షలాది జీవితాలను మార్చే మంచి నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్ రాష్ట్ర ఎన్టీఆర్ వైద్యశాల చైర్మన్ సీతం రాజు సుధాకర్ మాట్లాడుతూ... విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో సీఎం చంద్రబాబునాయుడు చేసిన కృషి ఫలించిందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు రివైవల్ ప్యాకేజీ కింద కేంద్ర ప్రభుత్వం 11,500 కోట్లు ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం స్టీల్ ప్లాంట్ పరిరక్షణపై కనీసం దృష్టి పెట్టలేదన్నారు. జగన్ సొంత ప్రయోజనాలు కోసం కేంద్రంతో సంప్రదింపులు జరిపారే తప్పా... ఒక్కసారి కూడా స్టీల్ ప్లాంట్ కోసం మాట్లాడలేదన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రజలకు మేలు చేసే ఒక్క పని చేయలేదని మండిపడ్డారు. నాకు ఎంత మీకు ఎంత అన్నచందంగా గత ఐదు సంవత్సరాలు వైసీపీ ప్రభుత్వం దోచుకుందన్నారు. సైకో పాలన నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడిప్పుడే తెరుకుంటుందని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీని ప్రకటించిన కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకుటి నారాయణరావు, వార్డు అధ్యక్షులు బంటుపల్లి సూర్యనారాయణ, ఉరుకుటి గణేష్, ఐతా మధు, కోరాడ చిన్న, బంగారు రవి శంకర్, సారిపల్లి మహేష్, గణపతి, ముక్కి రామకృష్ణ, షేక్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.




## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం : నిమ్మక జయకృష్ణ



పాలకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పేర్కొన్నారు. భామిని మండలంలోని నేరడిలో టీడీపీ, కూటమి పార్టీల కార్యకర్తలతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి వెళ్లిపోయిందని విమర్శించారు. అనంతరం బాలేరు, నేరడి ఇటీవల మృతి చెందిన జి.రాజులు, బి.శిమ్మయ్య, ఎస్.తవిటమ్మ, బి.రామారావు కుటుంబ సభ్యులు పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగదీష్, ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి సంబంధించి వివిధ పరి కరాలు సబ్సిడీపై రైతులకు అందిస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు మేలు చేస్తోందని పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తెలిపారు. మండలంలోని ఎం.రాజపురంలో రైతులకు సూర్యయంత్రాలను వీరఘట్టం, పాలకొండమండలాల్లోని రైతులకు అందజేశారు. కార్యక్రమంలో పాలకొండ మండల పరిషత్ అధ్యక్షులు బొమ్మాళి భాను, కూటమినాయకులు కర్నేన అప్పలనాయుడు, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉద యానఉదయ్‌భాస్కర్, సుధాకర్, పొగిరి శివన్నారాయణ, బొమ్మాళి సురేష్ పాల్గొన్నారు.

## మత్స్యకారుడి మృతి పట్ల మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి

శ్రీకాకుళం (చైతన్యరథం): గార మండలం బందరువానిపేట వద్ద పడవ బోల్తా పడి కుంది గద్దయ్య అనే మత్స్యకారుడు మృతి చెందడంపట్ల రాష్ట్ర వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాద ఘటన గురించి మత్స్యశాఖ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం మృతిని కుటుంబానికి అండగా ఉంటుందని మంత్రి అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. సముద్రంలో వేట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మత్స్యకారులకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి ఆదేశించారు.

## విశాఖ ఉక్కుకు కేంద్రం ప్యాకేజీ... ఎంపీ అప్పలనాయుడు హర్షం



విజయనగరం (చైతన్యరథం): విశాఖ ఉక్కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు ప్యాకేజీని ప్రకటించడం హర్షించదగ్గ విషయమని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. విశాఖ ఉక్కు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణమే అమల్లోకి వస్తుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయమని చెప్పారు. ప్రధాని మోదీ తీసుకున్న నిర్ణయంతో వేలాది కుటుంబాల్లో సంతోషం ఆనందం నిండుకుందని ఆయన చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషితో వేలాదిమంది కార్మిక, ఉద్యోగ కుటుంబాలకు న్యాయం జరిగిందని ఆయన చెప్పారు. దేశం, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మంచి పరిపాలన అందిస్తుందని ఆయన ప్రకటించారు.

## తోయక జగదీశ్వరీ ఆధ్వర్యంలో ముగిసిన సంక్రాంతి సంబరాలు



మన్యం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లా, గుమ్మలక్ష్మీపురం మండలం, తాడికొండ గ్రామంలో మూడు రోజులు పాటు జరిగిన సంక్రాంతి ఉత్సవాలు అట్టహాసంగా ముగిసాయి. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ కురుపాం నియోజకవర్గ శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ముగింపు సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బహుమతులు ప్రధానం చేశారు. చివరగా గ్రామ పెద్దలు, మహిళలు, యువత ఎమ్మెల్యేని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే తోటి మహిళలతో కలిసి థింసా నృత్యం, కోలాటం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో తాడికొండ గ్రామ పెద్దలు, మహిళా మండలి సభ్యులు, శ్రీమానిసిరమ్మ, యువజన సేవా సంఘం సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భారంగా తిరుగు పయనం... కిక్కిరిసిన బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు



విజయనగరం (చైతన్యరథం): సంక్రాంతి పండుగ కోసం సొంతూరికి వచ్చినవారు తిరుగు పయనమయ్యారు. దీంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిక్కిరిసి పోయాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారు భోగికి ఒక రోజు ముందే ఊరికి వచ్చారు. నాలుగు రోజుల పాటు మిత్రులు, బంధువులతో సంతోషంగా గడిపారు. కుటుంబంతో కలిసి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. బంధువులకు వీడ్కోలు పలుకుతూ బయలుదేరారు. దీంతో జిల్లాలోని రైల్వేస్టేషన్లు, బస్‌స్టేషన్లు రద్దీగా కనిపించాయి. ముఖ్యంగా విశాఖపట్నం, శ్రీకాకుళం, పార్వతీపురం, అనకాపల్లి తదితర ప్రాంతాల వారికి బస్సులు, రైళ్లు అందుబాటులో ఉన్నాయి. సుదూర ప్రాంతాలకు వెళ్లేవారికి మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో వందలాది కిలోమీటర్ల నుంచి వచ్చిన కొందరు ద్విచక్ర వాహనాలపై వెళ్లారు. ప్రమాదమని తెలిసినా.. తప్ప దం లేదు. ఆర్టీసీ బస్‌స్టేషన్లలో బస్సులు సమయానికి రాక, సీట్లు లేక చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తీవ్ర అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో కొందరు ప్రైవేట్ ట్రావెల్స్ రెట్టింపు ధరలు వసూలు చేశారు.

# రద్దీ దృష్ట్యా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక రైళ్ల సర్వీసులు




అమరావతి (చైతన్యరథం): సంక్రాంతి రద్దీ దృష్ట్యా తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల మధ్య దక్షిణ మధ్య రైల్వే పలు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. వీటికి అదనంగా మరో 8 ప్రత్యేక రైళ్లను పలు ప్రాంతాల మధ్య నడపనున్నట్లు శుక్రవారంనాడు ప్రకటించింది. కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు (నెం.07215)ను జనవరి 18న నడపనుంది. అలాగే నర్సాపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలును జనవరి 19న, విశాఖపట్నం - చర్లపల్లి ప్రత్యేక రైలును జనవరి 18న రెండు సర్వీసులు, 19 తేదీన ఒక సర్వీసు, చర్లపల్లి - విశాఖపట్నం ప్రత్యేక రైలును జనవరి 19, 20 తేదీన నడపనుంది. చర్లపల్లి - భువనేశ్వర్ ప్రత్యేక రైలును జనవరి 19న రైల్వే శాఖ నడపనుంది.

కాకినాడ టౌన్ - చర్లపల్లి ప్రత్యేక రైలు సామర్లకోట, రాజమండ్రి నిడదవోలు, తణుకు, భీవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, రాయనపాడు, ఖమ్మం, డోర్నకల్, మహబూబాబాద్, వరంగల్, కాజీపేట్, జనగామ స్టేషన్లలో ఆగనుంది. నర్సాపూర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు పాలకొల్లు, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, కాజీపేట్, జనగామ స్టేషన్లలో ఆగనుంది. విశాఖపట్నం - చర్లపల్లి మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, ఎలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగనున్నాయి. చర్లపల్లి - భువనేశ్వర్ ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట్, దువ్వాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం రోడ్, పలాస, బ్రహ్మపూర్, బలుగాన్, ఖర్దా రోడ్ స్టేషన్లలో ఆగనుంది.

# పర్యాటక కేంద్రంగా ఎస్.యానాం : కందుల దుర్గేష్

యానాం (చైతన్యరథం): సూరసేన యానాం ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఇక్కడి బీచ్లో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో గత గురువారం నాలుగో రోజు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మంత్రి దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పండగను కోడిపందేలకు పరిమితం చేస్తున్న ఈ రోజుల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కోనసీమ అందాలు కేరళలోనూ లేవన్నారు. రాబోయే రోజుల్లో ఈ ప్రాంతానికి గుర్తింపు తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ బీచ్ను కోకో బీచ్గా గా అభివర్ణిస్తే బాగుంటుందన్నారు. కోనసీమలో ఎయిర్పోర్టు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి అధిక ఆదాయం సమకూరుతుందని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే ఆనందరావుకు మంత్రి సూచించారు. అనంతరం మంత్రి దుర్గేష్ను ఘనంగా సత్కరించారు. ఎంపీ హరీష్మాథూర్, పళచోళ్ల పద్మనాభం, దంగేటి చిట్టిబాబు, లంకే భీమరాజు, మెట్ల రమణబాబు, అల్లాడ సోంబాబు, అయితాబత్తుల రాజశేఖర్, ఉలిశెట్టి దొరబాబు, ఇసుకపట్ల రఘుబాబు, జోగి రాజా, చీకట్ల శ్రీను, సత్తి చిన్నా, మేకల నానాజీ, కోటిపల్లి రాజు, రేవు తిరుపతిరావు పాల్గొన్నారు.



# విశాఖ ఉక్కుకు కేంద్ర సాయంపై ఎంపీ హర్షం



విజయవాడ (చైతన్యరథం): ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు ఎన్డీయే కూటమి ఇచ్చిన హామీలను డబుల్ ఇంజన్ సర్కార్ నెరవేరుస్తుందని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ను ఆదుకోవటం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.11,400 కోట్ల సాయాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తు పెట్టుకుంటారని, విశాఖ ఉక్కుకు ఆంధ్రుల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉందని వ్యాఖ్యానించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ను ఆదుకునేందుకు ప్యాకెజీ ప్రకటించిన ప్రధానమంత్రి మోదీ, విశాఖ స్టీల్ ప్లాంట్ను కాపాడేందుకు నిరంతరం కేంద్రంతో మాట్లాడి కృషి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం ప్రకటించిన ఆర్థిక సాయంతో విశాఖ ఉక్కుకి పూర్వ వైభవం వస్తుందన్నారు.

# స్టీల్ ప్లాంట్కు ప్యాకేజీ... చారిత్రాత్మక నిర్ణయం



జగ్గయ్యపేట (చైతన్యరథం): వైజాగ్ స్టీల్ ప్లాంట్కు ప్యాకేజీ ప్రకటించడం చారిత్రాత్మకమని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టం రఘురాం వ్యాఖ్యానించారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం రివైవల్ ప్యాకేజీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత పాలకులు విశాఖ ఉక్కుని నాశనం చేసేందుకు కుట్రలు చేశారని మండిపడ్డారు. స్టీల్ ప్లాంట్ ఆస్తుల్ని కబ్జా చేసేందుకు పోస్కో కంపెనీతో చీకటి ఒప్పందాలు చేసుకున్నారని మండిపడ్డారు. విశాఖ స్టీల్ప్లాంట్ మొత్తాన్ని నాశనం చేసేందుకు కుట్రలు చేసినట్లు మాజీ సీఎస్ బయటపెట్టారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే విశాఖ కేంద్రంగా 2 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇప్పుడు విశాఖకు తలమానికంగా నిలిచే విశాఖ ఉక్కు పరిశ్రమను ఆదుకోవడానికి కేంద్రం నుంచి ప్యాకేజీ సాధించామన్నారు. విశాఖ ఉక్కు విషయంలో కూటమి ప్రభుత్వ చొరవ పట్ల స్టీల్ప్లాంట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు వైజాగ్ స్టీల్ ప్లాంట్ కాపాడుతామన్న కూటమి ప్రభుత్వ హామీని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి సాధించిన కూటమి ప్రభుత్వ సారథి చంద్రబాబు నాయుడుకి రఘురాం ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# సంక్రాంతి వేళ రికార్డు స్థాయిలో మద్యం అమ్మకాలు



అమరావతి (చైతన్యరథం): సంక్రాంతి పండగ మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. పండగ జోరులో మందుబాబులు తెగ తాగేశారు. కేవలం మూడు రోజుల్లోనే రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.400 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. భోగి పండగ రోజు రూ.100 కోట్ల మద్యం అమ్మకాలు జరగ్గా.. ఇక సంక్రాంతి, కనుమ రోజుల్లో అయితే రోజుకు రూ.150 కోట్ల చొప్పున మద్యం విక్రయాలు జరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి. సంక్రాంతి సరుకు అయిపోవడంతో మద్యం షాపుల యజమానులు గురువారం భారీగా సరుకు కొనుగోలు చేయడంతో ఈ గణాంకాలు బయటకు వచ్చాయి. సాధారణంగా ఆంధ్రప్రదేశ్లో రోజుకు రూ.80 కోట్ల విలువైన మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. కానీ పండగ మూడు రోజుల్లో ఇందుకు అదనంగా రూ.160 కోట్ల మద్యం అమ్ముడైంది. భోగి రోజున మద్యం లైసెన్స్దారులు రూ.210 కోట్లు, గురువారం రూ.220 కోట్ల మద్యం కొనుగోలు చేశారు. జనవరి 10 నుంచి 15వ తేదీ వరకు చూస్తే 6,99,464 కేసుల లిక్కర్, 2,29,878 కేసుల బీరు అమ్ముడైంది. ఈ ఆరు రోజుల్లో లిక్కర్ అమ్మకాలు సగటు కంటే లక్ష కేసులు, బీరు దాదాపు 30 వేలకుపైగా అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఈసారి సంక్రాంతికి రికార్డు స్థాయిలో అమ్మకాలు జరిగాయని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వం మార్పు, మద్యం ధరలు తగ్గడం వంటి అంశాలు మద్యం అమ్మకాల పెరుగుదలకు దారితీసినట్లు తెలుస్తుంది. ఈసారి కోడి పందేల బరులు పెరగడం కూడా మద్యం అమ్మకాలపై ప్రభావం చూపింది. ఇతర రాష్ట్రాల నుంచి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ రాకుండా ఎక్సైజ్ శాఖ పటిష్ట చర్యలు తీసుకుంది. దీంతో మద్యం అమ్మకాలు పెరిగాయి. సాధారణంగా నూతన సంవత్సరం సమయంలో అత్యధిక స్థాయిలో మద్యం అమ్మకాలు జరుగుతుంటాయి. ఈ సారి డిసెంబరు 31న ఒక్కరోజే రాష్ట్రంలో రూ.200 కోట్ల మద్యం తాగేశారు. 2.5 లక్షల కేసుల లిక్కర్, 70 వేల కేసుల బీరు ఒక్కరోజే అమ్ముడైంది. అయితే న్యూ ఇయర్ స్థాయిలో గతంలో ఎన్నడూలేని విధంగా సంక్రాంతి పండక్కి కూడా మద్యం అమ్మకాలు రికార్డు స్థాయిలో పెరిగాయి. మూడు రోజుల్లో సగటున రోజుకు రూ.133 కోట్ల విక్రమాలు జరిగాయంటే అర్థం చేసుకోవచ్చు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చాక క్వార్టర్ రూ. 99కే అందుబాటులోకి రావడంతో లిక్కర్లో 23శాతం, బీరులో 38శాతం అమ్మకాలు పెరిగాయి. దీంతో పండగ మూడు రోజుల్లో ప్రభుత్వ ఖజానాకి దండిగా ఆదాయం పెరిగింది.

# శీతాకాలంలో అల్లంతో ఆరోగ్యం



శీతాకాలంలో అల్లం తింటే, అది మీ ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలికాలంలో వేధించే వ్యాధులకు చెక్ పెట్టే శక్తి అల్లానికి ఉంది. ఆరోగ్యంగా ఉండేందుకు ఇది సూపర్ ఫుడ్ గా పనిచేస్తుంది. యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-బి, విటమిన్-సి, సోడియం, పొటాషియం, మెగ్నీషియం, ఫోలేట్ మరియు జింక్ వంటి గుణాలు అల్లంలో ఉన్నాయి. అల్లం వల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటో తెలుసుకుందాం. చలికాలంలో పలు రకాల ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కోసం అల్లంతో కషాయం, సూప్, టీ చేసుకొని తీసుకోవటం మంచిదని చెబుతున్నారు. అల్లం శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది. అల్లం నీళ్లు కూడా ఆరోగ్యానికి మంచి చేస్తాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, అల్లంలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు కనిపిస్తాయి, ఇది నొప్పి నుండి ఉపశమనం అందించడంలో సహాయపడుతుంది. కడుపు సంబంధిత సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. మీరు గ్యాస్, అజీర్ణం వంటి కడుపు సంబంధిత సమస్యలతో పోరాడుతున్నట్లయితే, అల్లం మీకు దివ్యౌషధంగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు. అల్లం మనలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది.శీతాకాలంలో మన రోగనిరోధక శక్తి తరచుగా బలహీనపడుతుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో అల్లం అమృతం కంటే తక్కువ కాదు అంటున్నారు ఆరోగ్యనిపుణులు.

# పథకాల అమల్లో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు : చీఫ్ విప్ జీవీ

●మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష



వినుకొండ (చైతన్యరథం): అర్హులైన పేదలందరికీ పథకాలు సక్రమంగా అందాలని, లేదంటే కఠిన చర్యలు ఉంటాయని అధికారులను ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖపై సమీక్ష సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం వైపు నుంచి తీసుకుంటున్న చర్యలు ఫలాలు ప్రజలకు చేరేలా అధికారులు సమర్థంగా పనిచేయాల్సిందేనని స్పష్టం చేశారు. వినుకొండలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా అంగన్వావాడీలకు అండగా ఉంటున్నామన్న ఆయన చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు అంగన్వాడీ ఉపాధ్యాయ, సహాయకుల పోస్టుల వెంటనే భర్తీ చేపట్టనున్నామని అన్నారు. త్వరలో ఉద్యోగ ప్రకటనలు జారీ కానున్నాయని చెప్పారు.

అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్వాడీ కేంద్రాలకు శాశ్వత భవనాలు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో 366 అంగన్వాడీలుంటే వాటిల్లో 84 స్వంత భవనాల్లో, 92 పాఠశాలలు, పంచాయతీ భవనాల్లో నడుస్తున్నాయని, 140 వరకు అద్దె భవనాల్లో ఉన్నట్లు గుర్తించామని అన్నారు. 29 భవనాల నిర్మాణం అసంపూర్తిగా ఉందని, త్వరలోనే వాటిని పూర్తి చేస్తామన్నారు. నియోజకవర్గంలో గర్భవతులు 1949మంది, బాలింతలు 2006మంది, 6ఏళ్ల లోపు చిన్నారులు 17581 మంది ఉన్నారని, వారందరికీ ప్రభుత్వం అందించే పౌష్టికాహారం సకాలంలో, సక్రమంగా చేర్చాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, మహిళా సాధికారత, మాతా శిశు మరణాలు, గర్భిణీ మహిళలు, బాలింతలకు అమలవుతున్న పథకాలు, పిల్లలకు పౌష్టికాహారం అందించే పథకాలపై అధికారులతో సవివరంగా చర్చించారు. రాష్ట్రం మొత్తంలో 2014-19 టీడీపీ హయాంలో 6,119 అంగన్వాడీల నిర్మాణం చేస్తే.. వైసీపీ ప్రభుత్వం 2048 అంగన్వాడీ కేంద్రాలు మంజూరు చేసి కేవలం 18 పూర్తి చేసిందని అదే చిత్తశుద్ధికి నిదర్శనమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్ల కొరత లేకుండా చూడాలని, వినుకొండ నియోజ కవర్గంలోని అన్నీ అంగన్వాడీల్లో విద్యుత్ సదుపాయం కూడా తప్పనిసరిగా కల్పించాలన్నారు.

# కోటి సభ్యత్వాల నమోదు ఒక చరిత్ర

● టీడీపీకి కార్యకర్తలే బలం, బలగం : వసంత వెంకట కృష్ణ ప్రసాద్



మైలవరం (చైతన్యరథం): టీడీపీ కోటి సభ్యత్వాలకు పైగా నమోదుతో తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు చరిత్ర సృష్టించారని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాదు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న ఎన్టీఆర్ పార్టీని స్థాపించినప్పుడు ఒక్కరితో ఆరంభమైన ప్రయాణం నేడు కోటి మందికి పైగా కుటుంబ సభ్యులతో వర్ధిల్లుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1 కోటి 52 వేల 598 సభ్యత్వములు నమోదు చేసుకోవడం అభినందనీయమన్నారు. మైలవరం నియోజకవర్గంలో కూడా 66,369 మంది సభ్యతాలు తీసుకున్నారని, లైఫ్ టైమ్ సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికి కృష్ణప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సభ్యత్వ నమోదును ప్రతి గ్రామంలో ఒక ఉత్సవంలా నిర్వహించారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించారన్నారు. ముఖ్యంగా ఎన్ని జన్మలెత్తినా కార్యకర్తల రుణం తీర్చుకోలేనిదన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం తెలుగుదేశం పార్టీకి ఉందన్నారు. అలానే ఏ పార్టీ ఇవ్వని గౌరవం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఇస్తుందన్నారు. కార్యకర్తల మనోభావాలను, అభిప్రాయాలను గౌరవిస్తూ తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాల వారికి సముచిత ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. ఇటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పేదల సంక్షేమంతో పాటు తెలుగుదేశంపార్టీ కార్యకర్తల సంతోషం కోసం సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సభ్యత్వం తీసుకున్న తెలుగుదేశం కార్యకర్తల సంక్షేమం చూసేందుకు టీడీపీ కార్యకర్తల సంక్షేమ విభాగం నిర్విరామంగా శ్రమిస్తుందోన్నారు. ఈ మహత్తర కార్యక్రమంలో భాగస్వాములైన తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరికీ శాసనసభ్యులు కృష్ణప్రసాదు పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తాం : ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు అన్న నందమూరి తారక రామారావు వర్ధంతిని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. శుక్రవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ప్రజల నుండి అర్జీలు స్వీకరించి, పలు సమస్యలను అధికారులతో చరవాణిలో మాట్లాడి వెంటనే పరిష్కరించారు. అనంతరం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించి శనివారం నాడు జరిగే ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించుకునేలా పార్టీ నేతలకు ఎమ్మెల్యే దిశానిర్ధేశం చేశారు. పేదవాడికి పట్టెడు అన్నం పెట్టాలన్న సంకల్పంతో పార్టీ పెట్టిన ఎన్టీఆర్ స్ఫూర్తితో నియోజకవర్గములో అనేక చోట్ల అన్నదాన కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలతో పాటు నగరంపాలెంలోని రిజిస్టర్ ఆఫీస్ వద్ద, నల్లచెరువు 3 బొమ్మల సెంటర్, కొరిటెపాడు మెయిన్ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణలు జరగబోతున్నాయని, ఈ కార్యక్రమాలను పార్టీ నేతలు పెద్దఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# సంపద సృష్టించి అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబుకే ఉంది : గద్దె రామమోహన్

● విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిధులు కేటాయింపుపై హర్షం



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రంలోని ప్రజల కోరికలు, అవసరాలు తెలుసుకుని వాటిని సమకూర్చుకునేందుకు సంపదను సృష్టించి అభివృద్ధి చేసే సత్తా ఒక్క ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే ఉందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. శుక్రవారం ఉదయం అశోక్‌నగర్‌లోని తూర్పు నియోజకవర్గ శాసనసభ్యుని కార్యాలయంలో ఏడుగురు రజక సోదరులకు జీవనోపాధి నిమిత్తం ఇస్త్రీపెట్టెలను ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తన సొంత నిధులు రూ.50 వేలతో కొనుగోలు చేసి వారికి ఉచితంగా అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ... విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం గొప్ప బహుమతి ఇచ్చిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రవేటీకరణ చేయవద్దని గతంలో టీడీపీ చాలా స్పష్టంగా చెప్పడమే కాకుండా ఆందోళనలు కూడా చేశామన్నారు. కూటమిలో భాగమైన బీజేపీని ఒప్పించి విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సుమారు రూ.10 వేల 700 కోట్లను ఇవ్వడం వల్ల ప్లాంట్ నష్టాల నుంచి బయటపడుతొందన్నారు. ప్లాంట్‌కు నిధులు మంజూరు చేసిన బీజేపీ ప్రభుత్వానికి, బీజేపీని ఒప్పించి నిధులు విడుదల అయ్యేలా చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ కృతజ్ఞతలు తెలిపారు. 1999వ సంవత్సరంలో కూడా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రవేటీకరణ చేస్తామని చెప్పారని, అప్పుడు తాను ఎంపీగా ఉన్నానని, నారా చంద్రబాబునాయుడు సూచన మేరకు పార్లమెంట్ నాయకుడిగా ఉన్న యర్రంనాయుడు ఎంపీలందరినీ తీసుకువెళ్లి కేంద్రంపై ఒత్తిడి చేశారని చెప్పారు. తెలుగు రాష్ట్ర ప్రజల మనోభవాలు ఈ ప్లాంట్‌తో ముడిపడి ఉన్నాయని చెప్పి రూ.2 వేల కోట్లను ప్లాంట్ అభివృద్ధికి మంజూరు చేయించామన్నారు. ఆ నిధులతోనే విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పటివరకు కాపాడుకున్నామని చెప్పారు. ఇప్పుడు కేంద్రం విడుదల చేసిన నిధులతో ప్లాంట్‌ను మరికొంత కాలం కాపాడుకోవచ్చునని అన్నారు. రాష్ట్ర ప్రజల కోరికలు, ప్రజల అవసరాలు గుర్తించి ఆ అవసరాలను ప్రాధాన్యతా క్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమకూరుస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాట మాట్లాడి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని దోచుకున్నారని మండిపడ్డారు.

# యువ శాస్త్రవేత్తకు బొండా ఉమామహేశ్వరరావు అభినందన

విజయవాడ (చైతన్యరథం): శాస్త్రవేత్తగా దేశానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావు యువ శాస్త్రవేత్త జి.రమేష్‌ను అభినందించారు. తివేంద్రంలోని ఇస్రోలో సైంటిస్ట్‌గా త్వరలోనే విధుల్లఓ చేరనున్న విజయవాడ నగరంలోని 62వ డివిజన్ ప్రకాష్‌నగర్‌కు చెందిన జీ.రమేష్‌ను శుక్రవారం బొండా ఉమామహేశ్వరరావు అభినందించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆల్ ఇండియా లెవల్ ఇస్రో నిర్వహించిన పోటీ పరీక్షల్లో లక్ష యాభై వేల మంది పాల్గొనగా అందులో జి.రమేష్ తొమ్మిదివ ర్యాంక్ సాధించడం అభినందనీయమన్నారు. శాస్త్రవేత్తగా దేశానికి గొప్ప పేరు తీసుకువచ్చే విధంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. పతిష్టాత్మక ఇస్రో నిర్వహించిన పరీక్షలలో 9వ ర్యాంకు సాధించి ఇస్రో సంస్థలో మంచి స్థాయికి ఎదగాలన్నారు. నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని బొండా ఉమా కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు తొట్టెంపూడి ఉదయ్ శంకర్, పైడి శ్రీను, బొల్లెద్దుల రవిచంద్ర, ఒర్సు రవణమ్మ, గోపిరెడ్డి, రౌతు మంగరాజు, కేబుల్ రాజా తదితరులు పాల్గొన్నారు.



# పేదేలకు సీఎం సహాయనిధి సత్వర చేయూత : శ్రీరాం రాజగోపాల్



జగ్గయ్యపేట (చైతన్యరథం): పేదలకు సీఎం సహాయనిధి సత్వర చేయూత అందిస్తుందని, అసవరానికి డబ్బు లేక ఏ ప్రాణం పోకూడదన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య వ్యాఖ్యానించారు. సీఎం సహాయ నిధి నుండి మంజూరైన 1,75,582 రూపాయల చెక్కును బాధితు కుటుంబ సభ్యులకి శుక్రవారం అందజేశారు. నియోజకవర్గంలోని వత్సవాయి మండలం, దేచుపాలెం గ్రామానికి చెందిన షేక్ కరీం సాహెబ్ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ప్రైవేట్ హాస్పటల్ నందు చికిత్స చేయించుకుని మెడికల్ బిల్స్‌ను శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ రిఫరెన్స్ లెటర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయగా... సీఎం సహాయనిధి నుండి మంజూరైన రూ.1,75,582 చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ. అవసరానికి డబ్బు లేక ఏ ప్రాణం పోకూడదని సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పం అని అన్నారు. అనారోగ్యం బారిన పడి వైద్య చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న పేదలకు సీఎం సహాయ నిధి నుంచి సత్వరం చేయూత అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేచుపాలెం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కనపర్తి పాపారావు, కౌన్సిలర్ నకిరకంటి వెంకట్, టీడీపీ సోషల్ మీడియా వారియర్ మునగాల వంశీ తదితరులు పాల్గొన్నారు.

# అధోగతిలో ఆరోగ్య కేంద్రాలు

◆ప్రభుత్వ హాస్పిటళ్లను భ్రష్టు పట్టించారు

◆ప్రజారోగ్యం పట్టని వైసీపీ సర్కారు

◆సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి ధ్వజం

◆త్వరలో వెంకటాచలం సీహెచ్‌సీకి కొత్త పరికరాలు

◆త్వరలో పొదలకూరు సీహెచ్‌సీలో డయాలసిస్ సేవలు

వెంకటాచలం, (చైతన్యరథం) : వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ వైద్యశాలలను భ్రష్టు పట్టించారని సర్వేపల్లి శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అన్నారు. వెంకటాచలం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి దారుణంగా మారిందని విమర్శించారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.53 లక్షల నిధులతో మెరుగైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పేదలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ వైద్యం ప్రధాన లక్ష్యమని, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు.




మరో 15 రోజుల్లో వెంకటాచలం సీహెచ్ సీకి సీఎస్ఆర్ నిధులతో పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో పొదలకూరు సీహెచ్ సీలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రజలు కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వెంకటాచలం ఆస్పత్రి ఆవరణలో అడవిని తలపించేలా ఉన్న చెట్లను తొలగించడంతో పాటు మార్చురీ గదికి సిమెంట్ రోడ్డు వేయించామని తెలిపారు. సెంబ్ కార్ప్ కంపెనీ సహకారంతో రూ.53 లక్షలతో 15 రోజుల్లో పరికరాలు సమకూర్చుతున్నామని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన పరికరాల కోసం సెయింట్ కార్ప్ కంపెనీ రూ.1.90 కోట్లు ఖర్చుపెడుతోందని అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాన్పులు జరిగేలా క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్ ప్రారంభించబోతున్నామని పేర్కొన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఆస్పత్రులను పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటు ప్రభుత్వ నిధులతో పాటు అటు ప్రైవేటు కంపెనీల సీఎస్ఆర్ నిధులతో సాధ్యమైనన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. వెంకటాచలంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి మెరుగులు దిద్దుతున్నామన్నారు. అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. ఆసుపత్రి ఆవరణలో అడవిని తలపించేలా ఉన్న చెట్లను తొలగించామన్నారు. మార్చురీ గదికి సిమెంట్ రోడ్డు వేయించామని చెప్పారు. పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన పరికరాల కోసం సెయిల్ కంపెనీ రూ. 1.90 కోట్లు ఖర్చుపెడుతోందని వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రులలోనే కాన్పులు జరిగేలా క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో త్వరలోనే మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా డయాలసిస్ సెంటర్ ప్రారంభిస్తామని వెల్లడించారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటు ప్రభుత్వ నిధులతో పాటు అటు ప్రైవేటు కంపెనీల సీఎస్ఆర్ నిధులతో సాధ్యమైనన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని సోమిరెడ్డి చెప్పారు.

# ఇక అనధికార లేఔట్లపై దబిడి దిబిడే

◆ప్రత్యేక బృందాల ద్వారా తొలగిస్తాం

◆మంత్రి నారాయణ ఆదేశాల మేరకు లేఔట్ల ద్వారా వచ్చే ప్రతి పైసా నుడాకు చేరేలా చర్యలు

◆కొత్తగా 77 అనధికార లేఔట్లను గుర్తించాం

◆ నుడా చైర్మన్ కోటంరెడ్డి స్పష్టీకరణ

నెల్లూరు, (చైతన్యరథం) : ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న లేఔట్స్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. అనధికార లేఔట్లలో ప్రజలు ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయవద్దని అయన పిలుపునిచ్చారు. ముడా అధికారులతో ప్రత్యేకంగా తన చాంబర్లో సమావేశమయ్యారు. అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. అనధికారకంగా ఉన్న మరో 44 లేఔట్లను గుర్తించామన్నారు. వాటిని కూడా తొలగించేందుకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నుడాలో కొత్త సంస్కరణలు తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు.



నుడా అనుమతులు లేకుండా లేఔట్స్ వేసిన వారికి ఇప్పటికే నోటీసులు ఇచ్చామన్నారు. వాటిని తొలగించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎనిమిది నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే 260కి పైగా లేఔట్లను గుర్తించగా కొత్తగా మరో 44 గుర్తించామన్నారు. ఈ లేఔట్ల లో హద్దురాళ్ళు పీకేసి, ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు.. నుడాను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఈ నిర్ణయాలు తీసుకున్నట్లు కోటంరెడ్డి స్పష్టం చేశారు.. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీవో హిమబిందు, సెక్రటరీ పెంచల్ రెడ్డి పాల్గొన్నారు.



# తాగునీటి ఎద్దడి నివారణకు నిధులివ్వండి

◆ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిమ్మెంటు రోడ్లు

◆కలెక్టర్‌ను కోరిన గిద్దలూరు ఎమ్మెల్యే

గిద్దలూరు, (చైతన్యరథం) : నియోజకవర్గంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి కలెక్టర్ అన్సారీని కోరారు. ఆధార్ కార్డు లేకపోవడం వల్ల గిరిజనులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని తెలియజేశారు. గిద్దలూరు నియోజకవర్గంలోని గిరిజన ప్రాంతాల్లో అనేక కుటుంబాలకు ఆధార్ కార్డులు లేకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే గిరిజన ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరికి ఆధార్ గుర్తింపు కార్డులను అందచేయాలని కోరారు. అదే విధంగా నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, గిద్దలూరు పట్టణంలో సురక్షితమైన త్రాగునీరు అందించేందుకు ఎస్టీపీ స్కీమ్ అమలు చేయాలని, వచ్చే వేసవికాలంలో నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కారం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

# జోరుగా టీడీపీ సభ్యత్వాల స్వీకరణ

ఉదయగిరి, (చైతన్యరథం) :టీడీపీ సభ్యత్వ స్వీకరణ ప్రక్రియ అప్రతిహతంగా సాగుతోంది. టీడీపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిశీలకులు,రాష్ట్ర బీసీ నాయకులు గంజాం రాఘవేంద్ర తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. శాశ్వత సభ్యత్వం పట్ల నాయకులు ఆసక్తి చూపాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. ఉదయగిరి నియోజకవర్గం, వింజమూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న కలిగిరి మండల క్రాకుటూరు గ్రామ యువ నాయకులు, టీడీపి బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి, గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర బీసీ నాయకులు గంజాం రాఘవేంద్ర గారిని ఉదయగిరి శాసనసభ్యులు శ్రీ కాకర్ల సురేష్ గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కలిగిరి మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి , మాజీ మండల కన్వీనర్ చీమల తాతయ్య, క్లస్టర్ ఇంచార్జ్ కల్లూరు చంద్రమౌళి , వింజమూరు మాజీ మండల కన్వీనర్ చల్లా వెంకటేశ్వర్లు, గన్నమనేని శ్రీనివాసులు మరియు మండల నాయకులు పాల్గొన్నారు. శాశ్వత సభ్యత్వం తీసుకున్న ఉదయగిరి మండల కన్వీనర్ చింతనబోయిన బయన్న, గండిపాలెం గ్రామ పార్టీ అధ్యక్షులు రెడ్డి బత్తిన నరసింహారావు. తదితరులను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రత్యేకంగాం అభినందించారు.

**డిగ్రీ కళాశాల అభివృద్ధికి శ్రీకారం:ఎమ్మెల్యే కాకర్ల**

ఉదయగిరి మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధిపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టి సారించారు, ఇందులో



భాగంగా నూతన భవన నిర్మాణం కోసం కాలేజీ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్లసేసురేష్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలను అభివృద్ధి చేసే ఆలోచనలో భాగంగా నూతన భవన నిర్మాణం, పాత భవనాల మరమ్మతుల కోసం ఐదు కోట్ల రూపాయలను కేటాయింపై జరిగిందన్నారు. నూతన భవన నిర్మాణం కోసం కళాశాల ప్రాంగణాన్ని పరిశీలించామన్నారు, సంబంధిత అధికారులకు పక్కా ప్రణాళిక నమూనాను తయారుచేయమని సూచనలు ఇచ్చామన్నారు. తద్వారా భవన నిర్మాణ నమూనాలో మళ్లీ మళ్లీ మార్పులు చేయకుండా భవన నిర్మాణమును చేపట్టాలని కాంట్రాక్టర్‌ను, అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలి

◆ప్రజాదర్బార్‌లో భూ సమస్యల వెల్లువ

◆టీడీపీ నాయకుడు మౌర్య రెడ్డి

రాయచోటి, *(చైతన్యరథం) :* ప్రజా సమస్యల పరిష్కరానికే ప్రజాదర్బార్ కార్యక్రమం జరుగుతోందని టిడిపి నాయకులు మౌర్య రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం రాయచోటి పట్టణంలోని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మౌర్య రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో భూ సమస్యల అధికంగా ఉన్నాయని వివరించారు. వచ్చే వేసవికాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు గ్రామాలలో బోర్లు వేసి నీటి సమస్య పరిష్కరించేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఇందుకు ప్రజలు సహకరించాలని అన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో వచ్చే ప్రతి సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బాధితుల నుంచి టీడీపీ నాయకులు మౌర్య రెడ్డి అర్జీలు స్వీకరించారు.



# సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పుట్టా



మైదుకూరు (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం కడప జిల్లా మైదుకూరుకు రానున్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను శుక్రవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే పుట్టా మీడియా సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ఉదయం 10:30 గంటలకు ఉండవల్లి నివాసం నుండి 11:05 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. విజయవాడ ఎయిర్‌పోర్టు నుండి 11:50 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. 12 గంటలకు కడప ఎయిర్‌పోర్టు నుండి 12 :10 నిమిషాలకు మైదుకూరులో ఏర్పాటుచేసిన హెలిపాడ్‌కు చేరుకుంటారని చెప్పారు. అక్కడ నుండి 12 గంటల 20 నిమిషాలకు కేసీ కళ్యాణ మండపం చేరుకొని ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం 1:50 నిమిషాలకు కేసీ కళ్యాణ మండపం నుండి రోడ్డు మార్గం ద్వారా బయలుదేరి వినాయక నగర్ లోని మున్సిపల్ కార్మికుల ఇంటిని సందర్శించి ఇంటింటికి చెత్త సేకరణ గురించి వివరిస్తారని అన్నారు. 2:15 నిమిషాలకు అక్కడ నుండి బయలుదేరి నేషనల్ గ్రీన్ కాప్స్‌తో కలిసి నడకగా రాయల కూడలి ద్వారా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకుంటారని వివరించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణానికి చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శిస్తారని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. సాయంత్రం 4:30 నిమిషాలకు హెలిపాడ్ ప్రాంగణానికి చేరుకుని 4:40 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారన్నారు. 4:50 నిమిషాలకు కడప ఎయిర్‌పోర్టు నుండి బయలుదేరి 5:35 గంటలకు విజయవాడ విమానాశ్రయం చేరుకుంటారని తెలిపారు. అనంతరం 6 గంటల 15 నిమిషాలకు తాడేపల్లిలోని నివాసానికి సీఎం చంద్రబాబు చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, దాసరి బాబు, ధనపాల జగన్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.




# దుర్గమ్మ అమ్మవారి జాతరకు సన్నాహాలు

◆మూడు గ్రామాల పెద్దలతో ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ సమావేశం



రాప్తాడు (చైతన్యరథం): 68 ఏళ్ల తర్వాత దుర్గమ్మ అమ్మవారి జాతర నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రామగిరి మండలం నసనకోట-గంగంపల్లి గ్రామాల మధ్య కొలువై ఉన్న దుర్గమ్మకు 68 ఏళ్ల క్రితం జాతర జరిగింది. నసనకోట, గంగంపల్లి, వెంకటాపురం గ్రామస్తులు ఐక్యంగా ఈ జాతర జరుపుకునేవారు. అయితే పలు కారణాలతో కొన్నేళ్లుగా జాతర నిర్వహించలేదు. ఈ ఏడాది జాతర నిర్వహించాలని మూడు గ్రామాల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇదే విషయాన్ని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె శుక్రవారం అమ్మవారి ఆలయం ప్రాంగణంలో మూడు గ్రామాల పెద్దలతో సమావేశం అయ్యారు. ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈసారి జాతర నిర్వహించాల్సిందేనని మూడు గ్రామాల పెద్దలు నిర్ణయించారు. అయితే ఇది ఎలా నిర్వహించాలి.. అమ్మవారి ఆలయం వద్ద ఇది సాధ్యం అవుతుందా వంటి అంశాల గురించి చర్చించారు. మూడు గ్రామాల ప్రజలు పలు అభిప్రాయాలను ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ దృష్టికి తీసుకొచ్చారు. అందరి అభిప్రాయాలు విన్న తర్వాత జాతర కచ్చితంగా నిర్వహిద్దామని ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ తెలిపారు. అయితే ఎప్పుడు ఎలా అన్నది మరోసారి సమావేశమై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వారు తెలిపారు.



# వైసీపీ నుండి టీడీపీలో చేరిక

మడకశిర (చైతన్యరథం): మడకశిర తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం కాకి పంచాయతీ లక్కప్పనపల్లి గ్రామానికి చెందిన రంగప్ప, రామన్న, సిద్ద రాజు, జగన్నాథ్, సోమశేఖర్‌తో పాటు 5 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసి రెడ్డి, సిద్ద గంగప్ప, నరసింహమూర్తి, పాండురంగప్ప, రామకృష్ణ, ఉమేష్ అనిల్ కుమార్ , హేమంత్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊపిరి పోశారు

◆కేంద్రానికి మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు కృతజ్ఞతలు

మడకశిర (చైతన్యరథం): తెలుగు ప్రజలు అనేక పోరాటాలు, ఆత్మార్పణ చేసి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊపిరిపోసే విధంగా కేంద్ర ప్రభుత్వం రూ.11,400 కోట్లు ఆర్థికసాయం ప్రకటించడం పట్ల మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు శుక్రవారవ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గత ఐదేళ్లు విశాఖ ఉక్కును గాలికొదిలేసిన జగన్ రెడ్డి అండ్ కో వైఫల్యాన్ని ఇప్పటికైనా విశాఖ, ఉత్తరాంధ్ర ప్రజలు గ్రహించాలన్నారు. ఏపీలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కును కాపాడేందుకు తీసుకున్న



చర్యలు నేడు కేంద్రం చేసిన ప్రకటనతో స్పష్టమైందన్నారు. విశాఖ ఉక్కును కాపాడిన ఘనత ఏపీలోని కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కేంద్రం సహకారంతో ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కారులా కూటమి ప్రభుత్వం అభివృద్ధిపథంలో దూసుకుపోతోందని అన్నారు.

## హోరాహోరీగా బండలాగుడు పోటీలు

ఎమ్మిగనూరు (చైతన్యరథం): నీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న మాజీ మంత్రి బీవీ మోహన్ రెడ్డి స్మారక అంతర్ రాష్ట్ర ఒంగోలు జాతి ఎద్దుల బండలాగుడు పోటీలు శుక్రవారం హోరాహోరీగా కొనసాగుతున్నాయి. పోటీలను తిలకించేందుకు జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు సరిహద్దున ఉన్న తెలంగాణ, కర్ణాటక నుంచి ప్రజలు వచ్చారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు బహుమతులు అందజేయనున్నారు.



# వచ్చే నెల 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

◆ఏర్పాట్లపై ఈవో సమీక్ష

శ్రీశైలం (చైతన్యరథం): జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో ఫిబ్రవరి 19 నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. దాదాపు 11 రోజుల పాటు ఉత్సవాలు దేవస్థానం వైభవోపేతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఈవో శ్రీనివాసరావు దేవస్థానం అధికారులు, అర్చకులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం సహాయ సహకారాలతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని సూచించారు.

ప్రతి ఉద్యోగి భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడంలో శ్రద్ధ వహించాలని సూచించారు. ఎక్కడా అసౌకర్యం కలుగకుండా ఉండేలా అన్ని చర్యలు చేపట్టాలని ఆయా విభాగాల అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రూపొందించిన యాక్షన్ ప్లాన్ మేరకు ఏర్పాట్లలో నిమగ్నం కావాలని చెప్పారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 19న



మొదలవుతాయని తెలిపారు. భక్తులు ముందస్తుగానే శ్రీశైల క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలోనే ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత పాటించేలా చూడాలన్నారు. అన్ని విభాగాల అధికారులు సమష్టిగా విధులు నిర్వర్తించాలని చెప్పారు.

వైదిక సిబ్బంది, ఆలయ విభాగ అధికారులు పరస్పర సమన్వయంతో ఉత్సవాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా కైంకర్యాలన్నీ సంప్రదాయబద్ధంగా జరిపించాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని చెప్పారు. ఉత్సవాల్లో కైంకర్యాల సమయపాలనను ఖచ్చితంగా పాటించాలన్నారు. మహాశివరాత్రి పర్వదినమైన ఫిబ్రవరి 26న జరిగే ప్రభోత్సవం, పాగాలంకరణ, బ్రహ్మోత్సవ కల్యాణం, మరుసటి రోజున నిర్వహించే రథోత్సవం, తెప్పోత్సవం కార్యక్రమాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. పాదయాత్రగా వచ్చే భక్తుల సౌకర్యార్థం పెద్దచెరువు, భీమునికొలను, కైలాసద్వారం, సాక్షిగణపతి తదితర చోట్ల చేయాల్సిన ఏర్పాట్లపై దృష్టి సారించాలన్నారు.

శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు, జ్యోతిర్ముడి సమర్పణకు ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా ఉండాలన్నారు. క్యూకాంప్లెక్స్, క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా దర్శనం కోసం బారులు తీరే భక్తులకు ఎప్పటికప్పుడు మంచినీరు, అల్పాహారం అందజేయాలని అన్నప్రసాదవితరణ విభాగాన్ని ఆదేశించారు. ఇందు కోసం స్వచ్ఛంద సేవకుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

# భారత్ పెట్టుబడులకు స్వర్గధామం

◆ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ

◆భారత్ మొబిలిటీ ఎక్స్ పో-2025ను ప్రారంభించిన పీఎం

న్యూఢిల్లీ: దేశంలో ఎలక్ట్రిక్ మొబిలిటీ విస్తరణకు ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. దిగ్గజ వ్యాపారవేత్తలు రతన్ టాటా, ఒసాము సుజుకీ భారతదేశ ఆటో రంగం వృద్ధికి.. మధ్యతరగతి ప్రజల కలను నెరవేర్చడానికి ఎంతో సహకారం అందించారని అన్నారు. భారత్ పెట్టుబడులకు స్వర్గధామమని.. మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్తును రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని అన్నారు.

దేశ రాజధానిలోని భారత మండపంలో ఏర్పాటు చేసిన 'భారత్ మొబిలిటీ ఎక్స్ పో 2025ను శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ



ప్రారంభించారు. అనంతరం మోదీ మాట్లాడుతూ, గ్రీన్ టెక్నాలజీ, ఈవీలు, హైడ్రోజన్ ఇంధనం, జీవఇంధనాల అభివృద్ధిపై భారతదేశం దృష్టిసారిస్తోందన్నారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం దేశంలో ఆటో పరిశ్రమ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ దశాబ్దం చివరికి ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు ఎనిమిది రెట్లు పెరుగుతాయని అన్నారు.

ఐదేళ్ల క్రితం ప్రారంభించిన ఫ్రేమ్-2 పథకం కింద రూ.8 వేల కోట్లకు పైగా సబ్సిడీగా ఇచ్చామని ప్రధాని పేర్కొన్నారు. దీంతో 16 లక్షలకు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఢిల్లీలోనే 1200 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు భారతదేశంలో నాణ్యమైన రోడ్లు లేకపోవడంతో ప్రజలు కార్లు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోయేవారని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి మారుతుండటంతో కార్లకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏడాదికి దాదాపు 2.5 కోట్ల కార్లు విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు.

పెరుగుతున్న మధ్యతరగతి, వేగవంతమైన పట్టణీకరణ, సరసమైన వాహనాలు భారతదేశంలో ఆటో రంగాన్ని ముందుకు తీసుకువెళు తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని, వీరు వాహనాలను కొనుగోలు చేయాలనుకుంటున్నారని ప్రధాని మోదీ చెప్పారు. ఈవీలను ప్రోత్సహించడానికి పలు ప్రాంతాల్లో ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశామన్నారు.



## వందే భారత్ స్లీపర్ ట్రయల్స్ విజయవంతం!

అహ్మదాబాద్: భారతీయ రైల్వే ప్రతిష్టాత్మకమైన వందే భారత్ స్లీపర్ రైలు ట్రయల్ రన్ ముంబయి సెంట్రల్ - అహ్మదాబాద్ మధ్య విజయవంతంగా పూర్తయ్యింది. ట్రయల్‌లో భాగంగా ఉదయం 7.29 గంటలకు రైలు అహ్మదాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు ముంబయి సెంట్రల్ చేరుకుంది. మధ్యాహ్నం మళ్లీ ముంబయి సెంట్రల్ నుంచి అహ్మదాబాద్‌కు చేరుకుంది. ట్రయల్ రన్ విజయవంతమైన నేపథ్యంలో.. డేటాను విశ్లేషించిన తర్వాత రీసెర్చ్ డిజైన్స్ అండ్ స్టాండర్డ్స్ ఆర్గనైజేషన్ తుది సర్టిఫికెట్‌ను జారీ చేయనున్నది. ఆర్‌డీఎస్‌ఓ ట్రయల్స్‌ను పరిశీలిస్తున్నది. ఆ తర్వాత రైలు గరిష్ఠ వేగంపై రైల్వే భద్రతా కమిషన్ ద్వారా మూల్యాంకనం చేయనున్నారు. ఆ తర్వాతే వందే భారత్ స్లీపర్ రైలుకు అధికారిక ధ్రువీకరణ పొందుతుంది. అన్ని టెస్టుల్లో పాస్ అయిన తర్వాత మాత్రమే రెగ్యులర్ సర్వీస్ కోసం భారతీయ రైల్వేకు అప్పగిస్తారు. ఇటీవల నిర్వహించిన ట్రయల్స్‌లో వందే భారత్ స్లీపర్ ఇప్పటికే 180 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని అందుకున్న విషయం తెలిసిందే. సమాచారం మేరకు.. వచ్చేవారంలో వందే భారత్ స్లీపర్ రైలుకు సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత రైల్వే బోర్డు సర్వీసు రూట్‌పై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ట్రయల్స్‌లో భాగంగా ఈనెల 2న రాజస్థాన్‌లోని బుండి జిల్లాలోని కోటా - లాబన్ మధ్య స్లీపర్ రైలు గరిష్ఠ వేగం 180 కిలోమీటర్లను చేరుకుంది. అంతకు ముందు రోహల్ ఖుర్ద్ - కోటా మధ్య సైతం 180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించింది. కోటా-నాగ్డా, రోహల్ ఖుర్ద్-చౌ మహలా సెక్షన్లలో మాత్రం వరుసగా 170 కిలోమీటర్లు, 160 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది.

వందే భారత్ స్లీపర్ రైలులో మొత్తం 16 కోచ్‌లుంటాయి. ఇందులో 11 థర్డ్ ఏసీ టైర్ కోచ్‌లుంటాయి. నాలుగు సెకండ్ ఏసీ టైర్ కోచ్‌లు, ఒకటి ఫస్ట్ ఏసీ కోచ్ ఉంటుంది. అన్నింట్లో ప్రత్యేకంగా చార్జింగ్ పోర్ట్‌లు, ఫోల్డబుల్ స్నాక్ టేబుల్, ఇంటిగ్రేటెడ్ లైటింగ్ సిస్టమ్, ల్యాప్‌టాప్ చార్జింగ్ సెటప్ తదితర అధునాతన ఫీచర్స్‌ను సైతం రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. ఫస్ట్ ఏసీ కోచ్‌లో 24 బెర్తుంటాయి. ఇక సెకండ్ ఏసీ కోచ్‌లో 48 సీట్లు ఉంటాయి. థర్డ్ ఏసీ కోచ్‌లోని ఐదింటిలో 67 బెర్తులు, మరో నాలుగింట్లో 55 బెర్తుల చొప్పున ఉంటాయి. రైలు సహాయక సిబ్బంది కోసం సైతం 38 ప్రత్యేక బెర్తులంటాయి. దృష్టిలోపం ఉన్న ప్రయాణికులకు సహాయం అందించేందుకు బ్రెయిలీ నావిగేషన్ సైతం ఏర్పాటు చేశారు.

## ఎలక్ట్రిక్ కారు ఈ-విటారా వచ్చేసింది!

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ కంపెనీ శుక్రవారం ఎలక్ట్రిక్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. తొలిసారి మారుతీ కంపెనీ బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాన్ని లాంచ్ చేసింది.



ఈ కారును సుమారు వంద దేశాలకు ఎగుమతి చేయనున్నది. ఢిల్లీలోని భారత్ మొబిలిటీ ఆటో షోలో ఈ-విటారా మోడల్‌ను రిలీజ్ చేశారు. ఈ నేపథ్యంలో సుజుకీ మోటారు ప్రెసిడెంట్ తోషిహిరో సుజుకీ మాట్లాడుతూ.. ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్‌ను యూరప్, జపాన్‌తో పాటు వేర్వేరు ప్రాంతాలకు ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు.

మారుతీ సుజుకీ ఇండియా కంపెనీలో 58 శాతం వాటా సుజుకీ మోటార్ కార్పొరేషన్‌కు ఉంది. అయితే ఈ మోడల్ కార్ల ఉత్పత్తి కోసం ఇండియాను హబ్‌గా మార్చుకోవాలని ఆ కంపెనీ భావిస్తున్నది. గుజరాత్‌లోని మారుతీ సుజుకీ ప్లాంట్‌లో ఈ-విటారా కార్లను ఉత్పత్తి చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ-విటారాలో రెండు బ్యాటరీల ఆప్షన్ కల్పించారు. 49 కెడబ్ల్యుహెచ్, 61 కెడబ్ల్యుహెచ్ బ్యాటరీలు దీంట్లో ఉంటాయి. సింగిల్ ఛార్జ్‌తో సుమారు 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చు.

# గర్భిణీలకు రూ.21 వేలు

◆ఢిల్లీ ఎన్నికల వేళ.. బీజేపీ మేనిఫెస్టో విడుదల

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల వేళ భారతీయ జనతా పార్టీ హామీలు గుప్పించింది. గర్భిణీలకు రూ.21 వేలు, మహిళలకు నెలకు రూ.2,500, గ్యాస్ సిలిండర్‌పై రూ.500 రాయితీ ఇస్తామని ప్రకటించింది. ఎన్నికల హామీలకు సంబంధించిన 'సంకల్ప్ పత్రాన్ని' బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా శుక్రవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మహిళా సమృద్ధి యోజన కింద ఢిల్లీలోని ప్రతి మహిళకు నెలకు రూ.2,500 అందిస్తామని తెలిపారు. తొలి క్యాబినెట్ సమావేశంలోనే ఈ స్కీమ్‌ను ఆమోదిస్తామని చెప్పారు. అలాగే గర్భిణీలకు రూ.21 వేలు అందుతుందని అన్నారు.

కాగా, ఎల్పీజీ వాడుతున్న కుటుంబాలకు సిలిండర్‌పై రూ.500 సబ్సిడీ లభిస్తుందని జేపీ నడ్డా తెలిపారు. హోలీ, దీపావళి సందర్భంగా ఒక్కో గ్యాస్ సిలిండర్ ఉచితంగా అందుకుంటారని చెప్పారు. కేంద్రం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య పథకాన్ని ఢిల్లీలో అమలు చేస్తామన్నారు. రూ.5 లక్షల




ఆరోగ్య బీమాకు అదనంగా మరో రూ.5 లక్షల ఆరోగ్య రక్షణను ప్రతికుటుంబానికి కల్పిస్తామని తెలిపారు.

ఇక మురికివాడల్లో అటల్ క్యాంటీన్ల ద్వారా రూ.5కే పౌష్టికాహార భోజనం అందిస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. ఉచిత విద్యుత్, మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం వంటి అమలులో ఉన్న పథకాలను కూడా కొనసాగిస్తామని భరోసా ఇచ్చింది.

# వివాదాలు పరిష్కరించుకోండి

◆తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్‌కు సుప్రీంకోర్టు ఆదేశం



న్యూఢిల్లీ: తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. లేనిపక్షంలో తాము జోక్యం చేసుకుని పరిష్కరిస్తామని పేర్కొంది. తమిళనాడులోని విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్స్‌లర్ల (వీసీ) నియామకంపై సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవి మధ్య చాలాకాలంగా వివాదం కొనసాగుతున్నది. గవర్నర్ వీసీగా వ్యవహరించే అధికారాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో పాటు పలు నియామకాల్లో గవర్నర్ అధికారాలను పరిమితం చేసింది. అయితే ఈ బిల్లులను ఆమోదించడానికి ఆర్ఎన్ రవి నిరాకరించారు.

కాగా, మద్రాస్ విశ్వవిద్యాలయం, భారతీయార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాలకు వైస్-ఛాన్స్‌లర్లను నియమించడానికి గవర్నర్ రవి ఒక కమిటీని ఏర్పాటు చేశారు. అయితే ఈ చర్య చట్టవిరుద్ధమని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి సభ్యులను తొలగించడంతో పాటు ఆ కమిటీని పునరుద్ధరించింది. ఈ నేపథ్యంలో ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది.

మరోవైపు తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్బీ పార్దివాలా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇరువురు కలిసి బిల్లుల పెండింగ్ వివాదాన్ని పరిష్కరించుకోవడం మంచిదని సూచించింది. లేనిపక్షంతో ఈ సమస్యను తాము పరిష్కరిస్తామని కోర్టు హెచ్చరించింది.

## ఆగి ఉన్న బస్సును ఢీకొన్న మినీ వ్యాన్: తొమ్మిది మంది మృతి

ముంబై: ఆగి ఉన్న బస్సును మినీ వ్యాన్ ఢీకొట్టగా ఆ వాహనంలోని 9 మంది మరణించారు. మహారాష్ట్రలోని పూణే జిల్లాలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరు పరిశీలించారు. పూణే-నాసిక్ హైవేపై నారాయణగావ్ వైపు వెళ్తున్న మినీ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖాళీ బస్సును బలంగా ఢీకొట్టింది. కాగా, ఈ ప్రమాదం గురించి తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మినీ వ్యాన్‌లో ప్రయాణించిన 9 మంది ఈ ప్రమాదంలో మరణించినట్లు తెలిపారు. మృతులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.



# విడిపోతున్న ఒబామా దంపతులు!

## వార్తల్లో నిజంలేదంటున్న మిషెల్ టీం



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా దంపతులు విడాకులు తీసుకోనున్నారని వస్తున్న వార్తలపై మిషెల్ టీమ్ స్పందించింది. వారి వైవాహిక జీవితంపై నిరాధార వార్తలు వ్యాప్తి చేయొద్దని కోరింది. ఒబామా దంపతులు విడాకులు తీసుకుంటున్నారనే వార్తల్లో నిజం లేదని వెల్లడించింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారానికి మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హాజరవుతున్నారని తెలిపింది. అయితే ట్రంప్ వ్యవహార శైలి, గతంలో ఒబామా కుటుంబాన్ని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు, జాతి ఆధారంగా చేసే విమర్శలు.. మిషెల్ నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. అందువల్లే ఆ కార్యక్రమానికి ఆమె దూరంగా ఉంటున్నారని టీమ్ వెల్లడించింది. ట్రంప్ వ్యాఖ్యలను మిషెల్ తీవ్రంగా పరిగణించారని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆయనను తాను ఎప్పటికీ క్షమించనని తెలిపినట్లు పేర్కొన్నాయి.

ఇటీవల అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియలు జరిగిన సమయంలో ఆమె మరో ప్రాంతంలో ఉన్నందువల్ల ఆ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారని తెలిపింది. మిషెల్తోపాటు మాజీ హౌస్ స్పీకర్ నాన్సీపెలోసి, కాంగ్రెస్ నేత అలెగ్జాండ్రియా ఒకాసియో-కోర్టెజ్ వంటి ఇతర ప్రముఖులు కూడా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి దూరంగా ఉంటున్నట్లు సమాచారం. గత కొంత కాలంగా వివిధ కార్యక్రమాలకు మిషెల్ లేకుండా బరాక్ ఒబామా ఒంటరిగా హాజరవుతుండడంతో వారి మధ్య మనస్పర్థలు వచ్చినట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. ఇటీవల జరిగిన అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ అంత్యక్రియల కార్యక్రమానికి కూడా మిషెల్ హాజరుకాకపోవడం, ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి కూడా ఆమె దూరంగా ఉంటున్నారని వార్తలు రావడంతో ఒబామా దంపతులకు విడాకులు ఖాయమైనట్లు సోషల్ మీడియాలో వదంతులు వ్యాపించాయి.

# రష్యా తరపున పోరాడుతున్న 16మంది భారతీయులు మిస్సింగ్!



ఢిల్లీ: ఉక్రెయిన్తో జరుగుతోన్న యుద్ధంలో రష్యా తరపున పోరాడుతున్న 16మంది భారతీయులు కనిపించకుండా పోయినట్లు విదేశాంగశాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. అలాగే ఇప్పటివరకు 12మంది మృతిచెందినట్లు తెలిపారు. "రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో మాస్కో తరపున 126మంది భారతీయులు పాల్గొన్నట్టు సమాచారం ఉంది. అందులో 96మంది సైన్యం నుంచి బయటకు వచ్చారు. కొందరు స్వదేశానికి తిరిగివచ్చారు. మరికొందరు రష్యా దళాలతో పనిచేయడం లేదు. ఇక 18మంది ఇంకా సైన్యంలోనే పనిచేస్తున్నారు. వారిలో 16మంది ఆచూకీ లేదు. రష్యావారిని మిస్సింగ్ కేటగిరీలో చేర్చింది. అలాగే ఇప్పటివరకు యుద్ధంలో పోరాడుతూ 12మంది మరణించారు" అని జైస్వాల్ వెల్లడించారు. మిగిలిన వారిని త్వరగా స్వదేశానికి రప్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామ"ని చెప్పారు. రష్యా తరపున యుద్ధంలో పాల్గొంటూ కేరళవాసి టీబీ బినిల్ మృతి చెందిన సంగతి తెలిసిందే. అతడి సమీప బంధువుకు గాయాలయ్యాయి. దీనికి విదేశాంగ శాఖ తీవ్రంగా పరిగణించింది. "ఈ విషయాన్ని మాస్కోలోని రష్యన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఢిల్లీలోని రష్యన్ రాయబార కార్యాలయం అధికారులతోనూ మాట్లాడాము. ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా మిగిలిన భారతీయులను అక్కడి నుంచి పంపించాలని డిమాండ్ చేశాం" అని ఇటీవల ప్రకటన విడుదల చేసింది. తాజాగా మృతి ఘటనపై స్పందిస్తూ.. అతడి మృతదేహాన్ని సాధ్యమైనంత త్వరగా స్వదేశానికి తీసుకువచ్చేందుకు రష్యా అధికారులతో మాట్లాడుతున్నామని జైస్వాల్ తెలిపారు.

# కూలిన విమానం ఇంజనులో పక్షి ఈకలు!



దక్షిణ కొరియాలో ఇటీవల జెజు ఎయిర్ విమానం డిసెంబర్ 29న ల్యాండ్ అవుతూ రక్షణ గోడను ఢీకొట్టిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 179మంది మృతి చెందారు. అయితే ప్రమాదానికి గల కారణాలపై ఊహాగానాలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటన జరగడానికి నాలుగు నిమిషాల ముందు బ్లాక్ బాక్స్ పని చేయకపోవడం పలు అనుమానాలకు దారి తీసింది. దీంతో అసలు కారణం ఏమిటనే విషయంపై దర్యాప్తు కొనసాగు తోంది. ఈక్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది.

దర్యాప్తు సమయంలో ఆ విమానం రెండు ఇంజిన్లలో పక్షి ఈకలు, రక్తం ఉన్నట్లు అధికారిక వర్గాలు గుర్తించాయి. విమానం పక్షిని ఢీకొనడం వల్లే ప్రమాదం జరిగిఉంటుందా? అనే ప్రశ్నలు పునరావృతమవుతున్నాయి. కాగా, వార్తలపై దక్షిణ కొరియా రవాణా మంత్రిత్వశాఖ నుంచి ఎటువంటి స్పందనలేదు. డిసెంబర్ 29న ముయాన్ ఎయిర్ పోర్టు రన్వేపై ల్యాండింగ్ సమయంలో విమానం అదుపు తప్పి రక్షణగోడను ఢీకొట్టింది. దీంతో భారీగా మంటలు చెలరేగి విమానం పేలిపోయింది. ఈప్రమాదంలో 179మంది మృతి చెందినట్లు అక్కడి అధికారులు తెలిపారు. బ్యాంకాక్ నుంచి ముయాను వస్తుండగా దుర్ఘటన చోటు చేసుకుంది. విమానం రన్వేపై అత్యవసరం గా దిగే సమయంలో ల్యాండింగ్ గేర్ పని చేయకపోవడంతో అది బాడీ పైనే బెల్లీ ల్యాండింగ్ చేసిందని అధికారులు పేర్కొ న్నారు. అప్పటికే ఒక ఇంజినును పక్షి ఢీకొనడంతో దానిలో శక్తికూడా గణ నీయంగా తగ్గిందని.. అందువల్లే ల్యాండ్ అయ్యాక నియంత్రణ కోల్పోయి ముందుకు దూసుకెళ్లి కాంక్రీట్ గోడను ఢీకొట్టిందని తెలిపారు.

దర్యాప్తులో అధికారులు యాంత్రిక ప్రొసీజర్ సమస్యలను గుర్తించినట్లు ది టైమ్స్ పత్రిక పేర్కొంది. ముఖ్యంగా ఎయిర్ క్రాఫ్ట్ థ్రస్ట్ రివర్సర్స్, ఫ్లాప్స్, స్పీడ్ బ్రేక్స్ వంటివి పూర్తిస్థాయిలో పని చేయలేదని చెబుతున్నారు. మరోవైపు ఏవియేషన్ నిపుణుడు జెఫ్రే థాంప్సన్ మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది పూర్తిస్థాయిలో సన్నద్ధంగా లేకుండానే విమానం నేలపైకి దిగడానికి అనుమతించినట్టు ఉందన్నారు.

# పేలిపోయిన స్టార్‌షిప్ రాకెట్



అంతరిక్షరంగంలో క్రమంగా పురోగతి సాధిస్తున్న ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ఎక్స్ సంస్థకు కుదుపు. స్పేస్ఎక్స్ ప్రతిష్టాత్మకంగా ప్రయోగించిన పునర్వినియోగ భారీ రాకెట్ స్టార్‌షిప్ విఫలమైంది. టెక్సాస్‌లోని బొకా చికా వేదికనుంచి గురువారం సాయంత్రం 4.37గంటలకు రాకెట్‌ను ప్రయోగించారు. అయితే రాకెట్ నింగిలోకి దూసుకెళ్లాక మధ్యలోనే దానిపై భాగం సాంకేతిక కారణాలతో పేలిపోయింది. దీంతో శకలాలు కరేబియన్ సముద్రంలో పడ్డాయి. కిందిభాగం బూస్టర్ క్షేమంగా భూమిపైకి చేరింది. దీనికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి.

రాకెట్ పేలిపోవడంపై స్పేస్ఎక్స్ స్పందించింది. ప్రయోగానికి సంబంధించి ముఖ్యమైన సమాచారం సేకరించినట్లు పేర్కొంది. ప్రయోగం విఫలమైనప్పటికీ ఇది స్టార్‌షిప్ విశ్వసనీయతను పెంచిందని తెలిపింది. 232 అడుగుల భారీ రాకెట్ అయిన దీనిలో మొత్తం 33 రాప్టార్ ఇంజిన్లు వాడారు. ఇక స్టార్‌షిప్ రాకెట్ పేలిపోవడంతో దానినుంచి భారీగా శకలాలు కిందికి దూసుకొచ్చాయి.. దాంతో ఎయిర్ ట్రాఫికుకు అంతరాయం ఏర్పడింది. మరోవైపు శకలాలు కిందపడుతున్న దృశ్యాలను స్పేస్ఎక్స్ సీఈఓ ఎలాన్ మస్క్ షేర్ చేశారు. "విజయం సంగతి పక్కనపెడితే వినోదం మాత్రం గ్యారంటీ" అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. అలాగే వైఫల్యానికి గల ప్రాథమిక కారణాలను వెల్లడించారు.

# ఇజ్రాయెల్ -హమాస్‌ల మధ్య కుదిరిన సయోధ్య

అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్-హమాస్ మధ్య సయోధ్య కుదిరింది. బందీలను విడుదల చేయడానికి ఇరువర్గాల మధ్య ఒప్పందం చివరిదశకు చేరుకుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. ఈమేరకు ఇజ్రాయెల్ మీడియాలో వార్తలు వచ్చాయి. కాల్పుల విరమణ ఒప్పందానికి అడ్డుగా మారిన చిక్కులను మధ్యవర్తులు తొలగించినట్లు పేర్కొంది. అలాగే కేబినెట్ సమావేశం అనంతరం ఈ ఒప్పందాన్ని ఆమోదించేందుకు ఇజ్రాయెల్ ప్రభుత్వం సమావేశమవుతుంది. కేబినెట్ ఈ ఒప్పందాన్ని ఆమోదిస్తే.. ఆదివారం నుంచి ఇది అమలుకావొచ్చని తెలుస్తోంది. బందీల విడుదలకు ప్రతిగా ఇజ్రాయెల్ పాలస్తీనా ఖైదీలను విడిచిపెట్టనుంది. తర్వాత పూర్తిస్థాయిలో యుద్ధాన్ని ముగించేందుకు నిబంధనలు ఖరారు కానున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ



ఒప్పందం విషయమై ఇప్పటికే బందీల కుటుంబాలకు సమాచారం ఇచ్చినట్లు ప్రధానమంత్రి కార్యాలయం వెల్లడించింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మెరుపుదాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 1200 మందికి పైగా ఇజ్రాయెల్ పౌరులు చనిపోగా, 250 మందిని హమాస్ మిలిటెంట్లు బందీలుగా చేసుకున్నారు. దీంతో హమాస్‌పై ఇజ్రాయెల్ భీకరంగా విరుచుకుపడింది. హమాస్ అగ్రనేత ఇస్మాయెల్ హనియా, అక్టోబర్ 7నాటి ఘటనకు సూత్రధారి యహ్యా సిన్వార్ తోపాటు కీలక నేతలను హత మార్చింది. గాజాపై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 46,000 మందికి పైగానే పాలస్తీనీయులు మృతి చెందారు.

## క్రిప్టో కరెన్సీకి జాతీయస్థాయి ప్రాధాన్యం

# కొత్త అధ్యక్షుడు ట్రంప్ యోచన



అమెరికా తదుపరి అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడంతో క్రిప్టో కరెన్సీ బిట్కాయిన్ జోరు మీదుంది. క్రిప్టో కరెన్సీకి అనుకూలంగా ట్రంప్ ప్రభుత్వ నిర్ణయాలు ఉండొచ్చన్న అంచనాలతో దీని విలువ రికార్డుస్థాయిలో పెరుగు తోంది. ఈక్రమంలో అమెరికా జాతీయ ప్రాధాన్యత అంశంగా క్రిప్టో కరెన్సీని మార్చేదిశగా ట్రంప్ ఉత్తర్వులు ఇచ్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జనవ రి 20న అమెరికా అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు స్వీకరించిన తర్వాత క్రిప్టోపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని బ్లూమ్బర్గ్ కథనం పేర్కొంది. అలాగే క్రిప్టో రంగానికి సంబంధించిన విధి విధానాల నిమిత్తం క్రిప్టో కరెన్సీ అడ్వైజ రీ కౌన్సిలును ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి, రెండోసారి విజయంసాధించిన డొనాల్డ్ ట్రంప్‌నకు క్రిప్టో పరిశ్రమ నుంచి భారీ మద్దతు లభించింది. ఆయన పదవీ స్వీకార సమయంలో వేడుకలు, ఇతర ప్రారంభోత్సవ కార్యక్రమాల నిర్వహణ నిధికి ఆ సంస్థల నుంచి నిధులు అందాయి. అలాగే కొత్త ప్రభుత్వంతో సంబంధాలను చాటుకునేలా వాషింగ్టన్‌లో 'ఇనాగరల్ క్రిప్టోబాల్' పేరిట శుక్రవారం ఒక కార్యక్రమాన్ని నిర్వహించనున్నాయి. ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ పాలనలో క్రిప్టో రంగం తీవ్ర ఒడుదొడుకులను ఎదుర్కొంది. అయితే ట్రంప్ తీసుకువస్తారని భావిస్తోన్న ఉత్తర్వుల్లో.. అన్ని ప్రభుత్వ ఏజెన్సీలు డిజిటల్ ఆస్తులకు సంబంధించిన తమ విధానాలను సమీక్షించుకునేలా ఆదేశాలు ఉండొచ్చని ఆ కథనం పేర్కొంది. అలాగే ఆ సంస్థలపై కొనసాగుతోన్న వ్యాజ్యాలను నిలిపివేయడంపైనా చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ చర్యలు గనక అమలైతే ట్రంప్ హయాంలో క్రిప్టో రంగం దూసుకెళ్లనుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలాఉంటే.. ట్రంప్ సన్నిహితుడు, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ క్రిప్టో కరెన్సీకి మద్దతు ఇస్తుంటారన్న సంగతి తెలిసిందే.

# జాతీయ క్రీడాపురస్కారాలు ప్రదానం

- ఖేల్‌రత్న అవార్డులు అందుకున్న మను, గుకేష్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్
- తెలుగు తేజాలు జ్యోతి యర్రాజి, దీప్తి జీవాంజికి అర్జున అవార్డులు

ఢిల్లీ: 2024 సంవత్సరంలో క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం నాడు జాతీయ అవార్డులను ప్రదానం చేశారు. ఒలిపిక్స్, పారా ఒలిపిక్స్‌తో పాటు ఇతర ప్రపంచ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి రాష్ట్రపతి భవన్‌లో ఘనంగా జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జాతీయ క్రీడా అవార్డులను ప్రకటించింది. ఇందులో మొత్తం నలుగురు ఆటగాళ్లకు ఖేల్‌రత్న, 32 మందికి అర్జున అవార్డులు, అలాగే 3 మంది కోచ్‌లకు ద్రోణాచార్య అవార్డులు ప్రకటించింది. వీళ్లందరికీ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేశారు. దేశంలో అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాన్ని ప్రముఖ షూటర్, డబుల్ ఒలిపిక్ మెడలిస్ట్ మను భాకర్‌తో పాటు ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ అందుకున్నారు. వీళ్లిద్దరితో పాటు హాకీ విభాగంలో హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ కేటగిరీలో ప్రవీణ్ కుమార్ అవార్డులు స్వీకరించారు. లైఫ్‌టైం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్‌మింటన్), ఆర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్) పురస్కారాలు స్వీకరించారు.



**మెరిసిన తెలుగు తేజాలు**

జాతీయ క్రీడా పురస్కారాల ప్రదానంలో తెలుగు క్రీడాకారులు తళుక్కుమన్నారు. తెలుగు అథ్లెట్లు జ్యోతి యర్రాజి, దీప్తి జీవాంజి అర్జున పురస్కారాలు అందుకున్నారు.

**అర్జున అవార్డులు అందుకుంది వీరే**

అన్ను రాణి (అథ్లెటిక్స్) నీతూ (బాక్సింగ్) స్వీటీ బురా (బాక్సింగ్) వంతిక అగర్వాల్ (చెస్) సలీమా (హాకీ) అభిషేక్ (హాకీ) సంజయ్ (హాకీ) జర్మన్ ప్రీత్ సింగ్ (హాకీ) సుఖ్ జీత్ సింగ్ (హాకీ) స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్) సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్) అభయ్ సింగ్ (స్క్వాష్) సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్) అమన్ (రెజ్లింగ్) రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్) ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్) అజీత్సింగ్ (పారా అథ్లెటిక్స్) సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్) ప్రణవ్ సూర్య (పారా అథ్లెటిక్స్) హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్) సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్) నవదీప్ (పారా అథ్లెటిక్స్) నితేష్ కుమార్ (పారా బ్యాడ్మింటన్) తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్) నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్) మనీశా రాందాస్ (పారా బ్యాడ్మింటన్) కపిల్ పర్మార్ (పారా జూడో) మోనా అగర్వాల్ (పారా షూటింగ్) రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్).

అర్జున అవార్డ్స్ (లైఫ్ టైమ్) అందుకున్నవారిలో సుచా సింగ్ (అథ్లెటిక్స్) మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్) ఉన్నారు.

ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు) అందుకున్నవారిలో సుభాష్ రాణా (పారా షూటింగ్) దీపాలీ దేశ్ పాండే (షూటింగ్) సందీప్ సంగ్వాన్ (హాకీ) ఉన్నారు.

# బీసీసీఐ ప్రక్షాళన చర్యలు

**-ఆటగాళ్లకు పది పాయింట్ల నియమావళి సిద్ధం?**

ముంబయి: వరుస ఓటములతో టీమిండియా క్రికెట్ ప్రక్షాళనకు బీసీసీఐ పలు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే ఆటగాళ్లకు తిరిగి యోయో పరీక్ష తప్పనిసరి చేసిన బీసీసీఐ పర్యటనల సమయంలో ఆటగాళ్లకు మరికొన్ని కఠిన నిబంధనలు విధించనున్నట్లు తెలుస్తోంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ బాధ్యతలు చేపట్టాక టీమ్ ఇండియా వరుసగా రెండు టెస్టు సిరీస్‌ల్లో ఓడిపోయింది. దీంతో జట్టును ప్రక్షాళన చేయాలని బీసీసీఐ భావిస్తోంది. ఈ నెల 11న జరిగిన గత సమీక్ష సమావేశంలో పలు నిబంధనలను అమల్లోకి తీసుకురానున్నట్లు బీసీసీఐ సూచనప్రాయంగా వెల్లడించింది. స్టార్ ఆటగాళ్లకు దేశవాళీ క్రికెట్‌ను తప్పనిసరి చేయడం ఇందులో ప్రధానమైనదిగా తెలుస్తోంది. ఫిట్‌నెస్ విషయంలోనూ అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసినట్లు సమాచారం. తాజాగా ఇప్పుడు పది పాయింట్లతో కూడిన పాలసీని సిద్ధం చేసినట్లు వార్తలు వస్తున్నాయి. వీటినుంచి మినహాయింపు కావాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాల్సిందేనని బీసీసీఐ తేల్చిచెప్పిందని సమాచారం. అలాకాకుండా ఈ నిబంధనలను అతిక్రమిస్తే మాత్రం జాతీయజట్టుతో పాటు ఐపీఎల్ మ్యాచుల్లోనూ నిషేధం విధించే అవకాశం ఉంది. బీసీసీఐ పది సూత్రాలు ఇవేనని తెలుస్తోంది.

**వాణిజ్య ప్రకటనలు:** సిరీస్ పర్యటన సమయంలో ఎలాంటి వ్యక్తిగత షూటింగ్‌లు, వాణిజ్య ప్రకటనల షూటింగ్‌లకు అనుమతి లేదు. మ్యాచ్‌లపై దృష్టి మళ్లకుండా ఉండేందుకే ఈ నిర్ణయం.

**కుటుంబసభ్యులకు అనుమతి:** విదేశంలో ఏదైనా సిరీస్ 45 రోజులకు మించి పర్యటన ఉంటే కుటుంబాలకు కేవలం రెండు వారాల సమయం మాత్రం ఇవ్వనుంది. తక్కువ వ్యవధి గల సిరీస్‌లో కేవలం వారం రోజులు మాత్రమే కేటాయించనుంది.

**ఆటగాళ్ల ప్రయాణం:** ఏ సిరీస్‌కైనా సరే ఆటగాళ్లు వ్యక్తిగతంగా కాకుండా జట్టుతో పాటే కలిసి ప్రయాణించాల్సి ఉంటుంది. ఇలా చేయడం వల్ల ప్లేయర్ల మధ్య అనుబంధం కలుగుతుంది. ఫ్యామిలీతో ప్రయాణించాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి.



**దేశవాళీ మ్యాచ్‌లు:** ప్రతి క్రికెటర్ జాతీయ జట్టుకు ఎంపిక కావాలంటే దేశవాళీ క్రికెట్‌లో ఆడాల్సిందే. కుర్రాళ్లతోపాటు సీనియర్లకూ ఈ నిబంధన వర్తిస్తుంది. సరైన కారణం చూపించి మినహాయింపు పొందేందుకు అవకాశం ఉంటుంది.

**వ్యక్తిగత సిబ్బంది:** జట్టులోని ఎవరైనా సరే బోర్డు అనుమతి లేకుండా వ్యక్తిగత సిబ్బందిని వెంట తీసుకువెళ్లడం కుదరదు. కావాలంటే ముందస్తుగా అనుమతి తీసుకోవాల్సిందే.

**లగేజీ పరిమితులు:** గతంలో ఎంత లగేజీని వెంట తీసుకెళ్లినా దానికి బీసీసీఐ రుసుం చెల్లించేది. ఇకనుంచి 150 కేజీల వరకు మాత్రమే అనుమతి ఇవ్వనుంది. అంతకుమించితే ఆటగాళ్లే ఛార్జీలు చెల్లించాలి.

**ప్రాక్టీస్:** ప్రాక్టీస్ చేసేందుకూ జట్టులోని ప్రతి క్రికెటర్ రావాలి. సహచర క్రికెటర్లతో కలిసి ఒకే బస్సులో ప్రయాణించాలి.

**బోర్డు కార్యక్రమాలకు:** బీసీసీఐ నిర్వహించే మీటింగ్‌లు, కార్యక్రమాలకు ఆటగాళ్లందరూ అందుబాటులో ఉండాలి. ఇలా చేయడం.. బోర్డుతోపాటు క్రికెట్ అభివృద్ధికి ఉపయోగపడుతుంది.

**మ్యాచ్‌ల అనంతరం:** ఏదైనా పర్యటనలో సిరీస్ లేదా మ్యాచ్ ముగిసిన వెంటనే కొందరు ఆటగాళ్లు వ్యక్తిగతంగా వెళ్లిపోతున్నారు. ఇకనుంచి జట్టుతోపాటే వెళ్లాలి. అందరూ కలిసే ప్రయాణించాలి.

**రూమ్ షేరింగ్:** ఇప్పటివరకు స్టార్ క్రికెటర్లకు వ్యక్తిగత రూములు ఇచ్చేవారు. కుటుంబసభ్యులతో కలిసి ఉండేవారు. ఇకపై సహచర ప్లేయర్లతో కలిసి రూము పంచుకోవాలి. ఫ్యామిలీ వచ్చినప్పుడు మాత్రమే ప్రత్యేకంగా ఉండేందుకు అనుమతి వస్తుంది.

# ఢిల్లీ జట్టులో కోహ్లికి చోటు

**- మెడనొప్పితో ఆడేది అనుమానమే**



ఢిల్లీ: స్టార్ ఆటగాళ్ల రాకతో ఈ సారి రంజీ మ్యాచ్‌లు మరింత ప్రత్యేకత సంతరించుకున్నాయి. స్టార్ క్రికెటర్లు తప్పనిసరిగా దేశవాళీ క్రికెట్‌లో ఆడాలని బీసీసీఐ స్పష్టం చేసిన నేపథ్యంలో పలువురు జాతీయ క్రికెటర్లు రంజీ బరిలోకి దిగబోతున్నారు. ఈ క్రమంలో రంజీ ట్రోఫీ గ్రూప్ స్టేజ్‌లోని తొలి రెండు మ్యాచ్‌లకు ఢిల్లీ జట్టు తమ బృందాన్ని ప్రకటించింది. ఢిల్లీ జట్టులో విరాట్ కోహ్లి, రిషబ్ పంత్‌కు స్థానం కల్పించింది. పంత్ ఇప్పటికే రంజీల్లో ఆడేందుకు ఓకే చెప్పగా.. కోహ్లి నుంచి ఎలాంటి స్పందన రాలేదని ఢిల్లీ క్రికెట్ వర్గాలు చెబుతున్నాయి. అయినాసరే అతడికి జట్టులో చోటు కల్పించడం విశేషం. ఒకవేళ కోహ్లి ఆడటానికి అంగీకరిస్తే మాత్రం.. దాదాపు 13 ఏళ్ల తర్వాత దేశవాళీ క్రికెట్లో అడుగు పెట్టినట్లు అవుతుంది. కోహ్లి చివరిగా 2012లో రంజీ మ్యాచ్ ఆడాడు.

మరోవైపు కోహ్లి మెడ నరం పట్టేసిందని.. ఆ నొప్పితో బాధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. దాని కోసం ఇంజెక్షన్లను కూడా తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఫైనల్ ఎలెవన్‌లో ఆడటమూ కష్టమేనని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. అతడి గాయంపై అధికారికంగా మాత్రం ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇదే నిజమైతే ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్ తోపాటు ఫిబ్రవరిలో జరిగే ఛాంపియన్స్ ట్రోఫీలో కోహ్లి ఆడతాడా.. లేదా అనే విషయంలో ఉత్కంఠ నెలకొంది.

**కెప్టెన్‌గా బదోని?**

రంజీ గ్రూప్ స్టేజ్‌లో మొదట సౌరాష్ట్రతో జనవరి 23న ఢిల్లీ తలపడనుంది. ఈ మ్యాచ్‌కు రిషబ్ పంత్ సారథిగా ఉంటాడని తొలుత వార్తలు వచ్చాయి. అయితే, కెప్టెన్సీ వద్దని రిషబ్ స్వయంగా చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో అతడికి జట్టులో చోటు ఇచ్చిన ఢిల్లీ.. సారథ్య బాధ్యతలను మాత్రం ఆయుష్ బదోనీకి అప్పగించనుందని సమాచారం. ఇప్పుడు సౌరాష్ట్రతో పంత్ మ్యాచ్ ఆడితే.. దాదాపు ఏడేళ్ల తర్వాత రంజీ ఆడినట్లు అవుతుంది. చివరగా 2018 సీజన్లో పంత్ దేశవాళీ టోర్నీలో బరిలోకి దిగాడు.

**అందరూ ఆడాల్సిందే**

బీసీసీఐ నిబంధనల ప్రకారం.. ప్రతి ఒక్కరూ దేశవాళీ క్రికెట్లో ఆడాలి. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ ఇప్పటికే తమ జట్ల తరఫున ఆడేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు రోహిత్ శర్మ కూడా ఆడతాడని తెలుస్తోంది. ప్రస్తుతం ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యతో కలిసి నెట్స్‌లో రోహిత్ సాధన చేస్తోన్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# కరుణ్‌కు ఇప్పుడు అవకాశం కష్టమే

- జాతీయ జట్టులోకి వస్తే మాత్రం సంతోషిస్తా
- మాజీ క్రికెటర్ దినేష్ కార్తీక్

ఢిల్లీ: ఫిబ్రవరి 19 నుంచి మొదలయ్యే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత జట్టు ఎంపిక ఇప్పటికే పూర్తయి ఉంటుందని, కొత్తవారికి అవకాశం కష్టమేనని మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత్ ఇంకా తన జట్టును ఇంకా ప్రకటించలేదు. ఈ నెల 19లోగా ఎప్పుడైనా ఈ ప్రకటన రావొచ్చు. ఈ రేసులో దేశవాళీలో అదరగొడుతున్న కరుణ్ నాయర్‌కు చోటు దక్కుతుందని వార్తలు వస్తున్నాయి. అయితే మాజీ క్రికెటర్ దినేశ్ కార్తీక్ మాత్రం జట్టు ఎంపిక ఇప్పటికే ఓ కొలిక్కి వచ్చి ఉంటుందని.. కొత్తవారికి అవకాశం కష్టమేనని ఓ ఇంగ్లీష్ వ్యాఖ్యానించాడు. సెంచరీల మీద సెంచరీలు బాదేస్తున్న కరుణ్ నాయర్ పేరు ఇప్పుడు బాగా వినిపిస్తోంది. అతడు అద్భుతమైన ఫామ్లో ఉన్నాడు. మయాంక్ అగర్వాల్ కూడా బాగానే ఆడుతున్నాడు. అయితే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం భారత వన్డే జట్టు ఇప్పటికే సిద్ధమైందని భావిస్తున్నా. పెద్దగా మార్పులు కూడా ఉండకపోవచ్చు. కరుణ్ నాయర్‌ను జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు వస్తున్నాయి. బ్యాటింగ్‌తో అదరగొడుతున్న కరుణ్ నాయర్‌కు తిరిగి జాతీయ జట్టులోకి వచ్చే హక్కు ఉంది. ఫాస్ట్, స్పిన్ బౌలింగ్ రెండింటినీ అద్భుతంగా ఆడే ఆటగాడు అతను. అతడు జట్టులోకి వస్తే మాత్రం చాలా ఆనందిస్తా. కానీ, ఇప్పుడు ఉన్న పరిస్థితుల్లో అవకాశం వస్తుందని మాత్రం అనుకోవడం లేదని కార్తీక్ అన్నాడు.

**బీసీసీఐ ఆగ్రహం.. సంజుకు కష్టమేనా?**

ప్రతిఒక్కరూ దేశవాళీ క్రికెట్ ఆడాలని.. అప్పుడే జాతీయ జట్టు కోసం పరిగణనలోకి తీసుకుంటామని బీసీసీఐ ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఛాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కూ భారత జట్టును ప్రకటించాల్సిఉంది. వన్డే జట్టులోకి రావాలని గట్టిగా శ్రమించిన సంజు శాంసన్ ఇప్పుడు బీసీసీఐ ఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. విజయ్ హజారే ట్రోఫీలో ఆడకుండా.. అతడు దుబాయ్ వెళ్లినట్లు సమాచారం. దీనిపైనే బీసీసీఐ గుర్రుగా ఉన్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. సరైన కారణం చూపించకపోతే అతడిని సెలక్టర్లు ఎంపిక చేసే అవకాశాలు లేనట్లేనని పేర్కొన్నాయి.






# సంక్రాంతికే వచ్చాం.. మీరూ ఆదరించారు!

'సంక్రాంతికి వస్తున్నాం'తో మంచి హిట్టును అందుకున్నారు స్టార్ హీరో వెంకటేశ్. తాజాగా చిత్రబృందం సక్సెస్ సెలబ్రేషన్స్ నిర్వహించింది. అందులో అనిల్ రావిపూడి, వెంకటేశ్ మాట్లాడుతూ.. ప్రేక్షకుడి ఆదరణతోనే సినిమాకు ఇంత సక్సెస్ వచ్చిందన్నారు. ప్రతి దర్శకుడూ కొత్త ఆలోచనలతో ప్రచారం చేస్తే, ఎంత అద్భుతం జరుగుతుందో దర్శకుడు అనిల్ నిరూపించారని, తాము కూడా నేర్చుకోవాల్సిన సమయం వచ్చిందని నిర్మాత దిల్ రాజు అన్నారు. నిర్మాతల్లో ఒకరైన శిరీష్ మాట్లాడుతూ.. "పెద్ద విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ సినిమా మీ మొత్తం సమస్యను పరిష్కరిస్తుంది' అని అనిల్ అంటూ ఉండేవాడు. మేము బావిలో పడిపోతున్నామని ఎంతోమంది సంతోషపడేలోపు సినిమా మమ్మల్ని పక్కన పడేసింది. ఆ క్రెడిట్ అనిల్‌కే దక్కుతుంది. వెంకటేశ్ నిర్మాతల హీరో. ఒక నిర్మాత కుమారుడు కాబట్టి, ఎప్పుడూ నిర్మాత క్షేమమే కోరుకుంటారు' అని శిరీశ్ అన్నారు. "నా కెరీర్లో అత్యంత ఆనంద మైన క్షణాలివి. మనం కష్టపడి పనిచేస్తూ ఉంటే సక్సెస్ వస్తుందని నమ్ముతా.



తెలుగు ప్రేక్షకుల వల్లే ఈ సినిమా విజయం సాధ్యమైంది. మేము ఈ విజయంలో చిన్న భాగం మాత్రమే. నా ఎనర్జీకి కారణం ఆడియన్సే. సంక్రాంతికి వస్తున్నాని చెప్పాం. మీరూ వచ్చి సినిమాను హిట్ చేశారు. ఆనందంగా ఉంది' అని వెంకటేశ్ సంతోషం వ్యక్తం చేశారు. "ఈ సినిమా నాకు ప్రత్యేకం. ఐశ్వర్య రాజేశ్ పాత్రకు మహిళలంతా కనెక్టయ్యారు. మీనాక్షి చౌదరి కూడా బాగా నటించింది. భీమ్స్ సంగీతం సినిమాను మరోస్థాయికి తీసుకెళ్లింది. వెంకటేశ్ పెద్ద స్టార్ హీరో అయినప్పటికీ తనపై సెటైర్లు వేయించుకోవడానికి వెనకాడరు. ప్రాక్టికల్ హీరో. ఒక సినిమాను ప్రేక్షకుల కోణంలో ఆలోచిస్తా. నచ్చితే విజిల్స్ వేస్తా. ప్రతి శుక్రవారం థియేటర్‌కు వెళ్లి విజిలేస్తా. నాకు తెలిసింది ఇదే" అని దర్శకుడు అనిల్ రావిపూడి అన్నారు. "నేను ఇప్పటి వరకు చేసిన పాత్రల్లో ఇదే కష్టమైనది. ఈ సినిమా వల్ల నాకు దక్కిన ప్రశంసలన్నీ అనిల్ రావిపూడికే చెందాలి. వెంకటేశ్ నాకు గురువుతో సమానం. ఆయనతో నటించడం నాకు దక్కిన అదృష్టం. సినిమా హిట్‌కు ఆయనే ప్రధాన కారణం" అని ఐశ్వర్య అన్నారు.

## శివరాత్రి కనుకగా 'రాక్షస'

కన్నడ డైనమిక్ ప్రిన్స్ ప్రజ్వల్ దేవరాజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'రాక్షస'. ఈ చిత్రాన్ని శివరాత్రి సందర్భంగా ఫిబ్రవరి 26న ఒరిజినల్ వెర్షన్ కన్నడతోపాటు తెలుగులోనూ రిలీజ్ చేయనున్నారు. గతంలో శివరాజ్‌కుమార్ నటించిన వేద చిత్రాన్ని విడుదల చేసిన ఎంవీఆర్ కృష్ణ 'రాక్షస' ట్రైలర్ నచ్చి తెలుగు రైట్స్‌ను దక్కించుకున్నారు. కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ బ్యానర్‌పై రెండు తెలుగు రాష్ట్రాల్లో భారీ విడుదలకు సన్నాహాలు చేస్తున్నారు. లోహిత్ హెచ్ దర్శకత్వం వహించిన ఈ టైమ్ లూప్ హారర్ చిత్రం నుంచి విడుదలైన ఫస్ట్‌లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది.

ఈ సందర్భంగా నిర్మాత ఎంవిఆర్ కృష్ణ మాట్లాడుతూ.."ఈ చిత్రంప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. సంక్రాంతి సందర్భంగా విడుదలచేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచిరెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే టీజర్ ట్రైలర్‌ను కూడా రిలీజ్ చేస్తాం. మంచి కంటెంట్ ఉన్న చిత్రాలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. ఈచిత్రానికి కూడా ప్రేక్షకుల నుంచి మంచిఆదరణ దక్కుతుందని నమ్మకం ఉంది"అని చెప్పారు.ఇక ఈ చిత్రంలో అరుణ్‌రాథోడ్, శ్రీధర్,గౌతమ్,సోమశేఖర్, విహాన్ కృష్ణ తదితరులు నటిస్తున్నారు.ఈ సినిమాకు నోబిన్ పాల్ సంగీతం అందిస్తుండగా జైబిన్ పి.జాకబ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

## లైలా'సేన్ లుక్స్ భలే!

ప్రేమికుల రోజున 'లైలా'గా సినీప్రియులకు గిలిగింతలు పెట్టనున్నారు నటుడు విశ్వక్ సేన్. ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ తెరకెక్కిస్తున్నారు. సాహు గారపాటి నిర్మిస్తున్నారు. ఆకాంక్ష శర్మ కథానాయిక. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా ఫిబ్రవరి 14న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా 'లైలా' టీజర్ విడుదల చేసింది. 'మనకు తెల్లగా చేసుడే కాదు. తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ చెప్పిన డైలాగులు ఆకట్టుకునేలా ఉన్నాయి. టీజర్ చివర్లో అమ్మాయి వేషధారణలో విశ్వక్ సేన్ లుక్స్, నటన సినీ ప్రియులను విశేషంగా అలరించేలా ఉంది.



## ప్రియాంక వచ్చింది అందుకేనా..?



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీప్రియులు ఎదురు చూస్తున్న ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబి 29.మహేశ్‌బాబు హీరోగా దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించనున్న సినిమా ఎప్పుడెప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందా? అని ఆసక్తిగా ఉన్నారు. దీంతో ఈ సినిమాకు సంబంధించిన వార్తలు క్షణాల్లో వైరల్‌గా మారుతున్నాయి. ఇందులో బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా నటించనున్నట్టు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. తాజాగా ఆమె హైదరాబాద్ చేరుకున్నారు.దీంతో మహేశ్-రాజమౌళి ప్రాజెక్ట్ కోసమే హైదరాబాద్‌కు వచ్చారంటూ కామెంట్స్ వినిపిస్తున్నాయి.ఆమె విమానాశ్రయంలో కనిపించిన వీడియోలు సోషల్ మీడియాలో షేర్ అవుతున్నాయి. ఈ సినిమా షూటింగ్‌పై త్వరలోనే అధికారిక అప్‌డేట్ వచ్చే అవకాశముందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం హైదరాబాద్‌లో పూజా కార్యక్రమాల్ని నిర్వహించి సినిమాకి శ్రీకారం చుట్టింది.కథానేపథ్యం మినహా, ఈ సినిమాకి సంబంధించి ఇప్పటి వరకూ అధికారికంగా ఎలాంటి సమాచారాన్నీ బయట పెట్టలేదు.అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతోపాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్ కెఎల్ నారాయణ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు.

### హాలీవుడ్‌కు జేమ్స్ బాండ్.. టాలీవుడ్‌కు మహేశ్ బాబు: తమన్

ఇప్పటికే ఎస్ఎస్ఎంబీ 29పై రచయిత విజయేంద్రప్రసాద్, టాలీవుడ్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజలాంటి ప్రముఖులు చేసిన కామెంట్స్ సినిమాపై అంచనాలు రెట్టింపు చేశాయి. తాజాగా మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఈ భారీ ప్రాజెక్ట్‌పై ఆసక్తికర కామెంట్స్ చేశారు.'హాలీవుడ్‌కు జేమ్స్‌బాండ్ ఎలానో..టాలీవుడ్‌కు మహేశ్ అలాగా. ఈ సినిమా అలవోకగా రూ.వెయ్యి కోట్లు సాధిస్తుందని, దీని బాక్సాఫీస్ లెక్కలు ఎవరూ ఊహించలేరు' అని అన్నారు.దీంతో ఈ కామెంట్స్ మహేశ్ అభిమానుల్లో జోష్ నింపుతున్నాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటివరకూ చూడని సరికొత్త ప్రపంచాన్ని రాజమౌళి ఆవిష్కరించబోతున్నారని రచయిత విజయేంద్రప్రసాద్ గతంలో ఓ ఇంటర్వ్యూలో చెప్పిన విషయం తెలిసిందే.

## నోరూరించిన నాగచైతన్య

నాగచైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వం లో తెరకెక్కుతోన్న చిత్రం 'తండేల్. సాయిపల్లవి కథానాయిక.ఫిబ్రవరి 7న సినిమా విడుదల కానుంది. సిని మాకు సంబంధించిన ఎక్కువ భాగం చిత్రీకరణ ఉత్తరాంధ్ర ముఖ్యంగా విశాఖపట్నం, శ్రీకాకుళంలో జరిగిన విషయం తెలి సిందే. చిత్రీకరణ సమయంలో చైతన్య విశాఖపట్నంలోని స్థానికులతో మాట్లాడారు. వారి స్టైల్లోనే చేపల పులుసుచేసి పెడతానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఓరోజు చేపల పులుసు వండి అక్కడివారికి వడ్డించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా షేర్ చేసింది.



## 'మాన వినాలంటూ..'

### పవన్.. పాటొచ్చేసింది

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరి హర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. రెండు భాగాలుగా ఇది విడుదల కానుంది. 'హరిహర వీరమల్లు పార్ట్ 1: స్వార్డ్ వర్సెస్ స్పిరిట్ పేరుతో తొలిభాగం మార్చి 28న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం తాజాగా సినిమా నుంచి తొలిపాటను విడుదల చేసింది. 'మాట వినాలి' అంటూ సాగే పాటను పవన్ కల్యాణ్ ఆలపించారు. కీరవాణి స్వరాలు అందించారు.

